

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 365 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శనివారం 15 మార్చి 2025 | వెల : 4/-

## కేంద్రం 2150 కోట్లు ఇవ్వడం లేదు



- తమిళనాడు బడ్జెట్‌లో మంత్రి ఆరోపణ
- హిందీ భాష అమలు వివాదం నేపథ్యంలో.. కేంద్రం మోసానికి పాల్పడినట్లు విమర్శ
- సమగ్ర శిక్షా స్కీమ్ కింద అందాల్సిన 2150 కోట్ల నిధుల్ని కేంద్రం రిలీజ్ చేయడంలేదు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రభావం పడకుండా ఉండేందుకు.. ఉద్యోగుల జీతాల కోసం నిధుల్ని ఉంచినట్లు తెలిపారు.

## కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర, కక్ష లేదు

- ' డీఎంకే ప్రాంతీయ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయంతం చేస్తోంది.
- అందులో భాగంగా కేంద్ర పై విషయ ప్రచారం మొదలెట్టింది
- కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర లేదు
- డీఎంకే ముసుగులో కాంగ్రెస్ పార్టీ, బీఅర్‌ఎస్ పార్టీలు ఉన్నాయి
- దక్షిణాదిలో బీజేపీ బలపడటం చూసి ఈ మూడు పార్టీలు భయపడుతున్నాయి.
- బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



హైదరాబాద్: కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర, కక్ష లేదని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం) బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎంపీ లక్ష్మణ్ ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ' డీఎంకే ప్రాంతీయ సెంటిమెంట్ ను రెచ్చగొట్టే ప్రయంతం చేస్తోంది. అందులో భాగంగా కేంద్ర పై విషయ ప్రచారం మొదలెట్టింది. కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర లేదు. డీఎంకే ముసుగులో కాంగ్రెస్ పార్టీ, బీ అర్ ఎస్ పార్టీ లు ఉన్నాయి. దక్షిణాదిలో బీజేపీ బలపడటం చూసి ఈ మూడు పార్టీలు భయపడుతున్నాయి. ఏపీలో ఎన్డీఏ, - మిగతా3లో

## సైకిల్ ఎంట్రీ..
# మారనున్న గేర్







- తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో యాక్టివ్ కావాలని భావిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
- వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనన్న ధీమా ఆపార్టీలో మరింతగా వ్యక్తమవుతుంది
- బీఆర్‌ఎస్‌కు తెలంగాణలో టీడీపీ రీ ఎంట్రీ ఉపయోగపడుతుందన్న విశ్లేషణలు కూడా ఊపందుకుంటున్నాయి
- టీడీపీ ఓటు బ్యాంకు 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కు టర్న్ అయ్యాయి.

హైదరాబాద్

తెలంగాణాలో తెలుగుదేశం పార్టీ తిరిగి తెలంగాణ రాజకీయాల్లో యాక్టివ్ కావాలని భావిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనన్న ధీమా ఆపార్టీలో మరింతగా వ్యక్తమవుతుంది. బీఆర్‌ఎస్ కు తెలంగాణలో టీడీపీ రీ ఎంట్రీ ఉపయోగపడుతుందన్న విశ్లేషణలు కూడా ఊపందుకుంటున్నాయి. ఎందుకంటే ఏ రకంగా చూసినా అది కారు పార్టీకి లాభమేనని, సైకిల్ వస్తే కారు గేర్ మార్చడం ఖాయమన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినపడుతున్నాయి. తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ లుగా విడిపోయిన తర్వాత తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలహీనంగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. అందరూ ఒప్పుకుని తీరాల్సిందే. అయితే టీడీపీ ఓటు బ్యాంకు 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కు టర్న్ అయ్యాయి. తర్వాత 2023 ఎన్నికల్లో టీడీపీలో అత్యధికశాతం ఓట్లు కాంగ్రెస్ కు మళ్లాయంటారు. పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి ఉండటంతో తెలుగుదేశం పార్టీ క్యాడర్ తో పాటు ఓటర్లు - మిగతా3లో

## రేవంత్ పార్టీ
# మారతారా?

- రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా షాక్ ఇచ్చే అవకాశం ఉంది అనే వార్తలు ఎప్పటి నుంచో వస్తున్నాయి
- ఏఐసిసి పెద్దలకంటే బీజేపీ నేతలకే రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు అనే ప్రచారం కూడా జరిగింది.
- ఈ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో నవ్వుతూ మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువ
- మరో వైపు తెలంగాణలో సీఎం మార్పు లేదని క్లారిటీ ఇచ్చారు
- కాంగ్రెస్ హైకమాండ్‌తో ఏదైనా సాధించుకునే సత్తా తనకు ఉందన్నారు.




హైదరాబాద్

తెలంగాణలో రాజకీయ పరిణామాలు ఆసక్తిని రేపుతున్నాయి. ముఖ్యంగా రేవంత్ రెడ్డి వేదికగా పెద్ద ఎత్తున రాజకీయ చర్చలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా షాక్ ఇచ్చే అవకాశం ఉంది అనే వార్తలు ఎప్పటి నుంచో వస్తున్నాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటుగా కేంద్ర మంత్రులతో రేవంత్ రెడ్డి ఎక్కువగా సహవాసం చేస్తూ ఉంటారు. ఆయన ఎప్పుడు ఢిల్లీ వెళ్ళినా సరే కేంద్ర మంత్రులను కలవకుండా వచ్చిన పరిస్థితి లేదు. ఏఐసిసి పెద్దలకంటే బీజేపీ నేతలకే రేవంత్ రెడ్డి - మిగతా3లో

## బీజేపీ నేతలతో రేవంత్ రహస్య
# భేటీల మర్మమేమి?



- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు
- నీళ్లు లేక పంటలు ఎండి- పొలాలు బీడువారి అన్నదాతలు అరిగోస పడుతుంటే.. కనీసం సాగునీళ్లపై సమీక్ష లేకుండా ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నావ్
- "39 సార్లు ఢిల్లీ పోయి మీడియా ముందు సెల్ఫ్ డబ్బా కొట్టుకునుడు తప్ప.. ఢిల్లీ నుంచి సాధించిన పని.. తెచ్చిన రూపాయి లేదు.
- రాహుల్ గాంధీతో నీ సంబంధాల గురించి తెలంగాణకు ఏం అవసరం.. మీ మధ్య సంబంధం ఉంటే మాకేంటి-ఊడితే మాకేంటి.. తెలంగాణకు ఒరిగేది ఏంటి?
- ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ ఈ చీకటి మీటింగులు పెట్టడమేంటి?"



## జమ్మూకశ్మీర్‌లో
# యాక్టివ్‌గా విదేశీ ఉగ్రవాదులు

- 60 మంది విదేశీ ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నట్లు ఓ నివేదిక
- కశ్మీర్‌లో జరుగుతున్న చొరబాటుదారుల హింసలో 17 మంది స్థానిక ఉగ్రవాదులు
- లష్కరే తోయిబాతో పాటు జేష్ ఏ మొహమ్మద్, హిజ్‌బుల్ ముజాయిద్దీన్ తీవ్రవాదులు కూడా ఉన్నారు.

# సునీతా విలియమ్స్ ప్రయాణానికి మళ్లీ బ్రేక్



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అనేక నెలల పాటు చిక్కుకుపోయి, ఇంకొన్ని రోజుల్లో భూమికి తిరిగి రావాల్సిన వ్యోమగాములు సునితా విలియమ్స్, బుచ్ విల్మోర్లకు మరో షాక్! వారిని భూమికి తిసుకొచ్చేందుకు బయలుదేరాల్సిన స్పేస్ఎక్స్ మిషన్.. చివరి నిమిషంలో ఆగిపోయింది. రాకెట్ లాంచ్ప్యాడ్లో చివరి నిమిషంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో బుధవారం క్రూ-10 ప్రయోగాన్ని వాయిదా వేసింది స్పేస్ఎక్స్.బోయింగ్కు చెందిన స్టార్లైనర్లో ప్రయాణించిన తర్వాత వ్యోమగాములు సునితా విలియమ్స్, బుచ్ విల్మోర్లు తొమ్మిది నెలలుగా అంతరిక్షంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్లాన్ ప్రకారం.. అనుభవజ్ఞులైన అయిన వ్యోమగా ములు కేవలం ఎనిమిది రోజులు మాత్రమే ఐఎస్ఎస్లో ఉండాలి. కానీ ఇప్పుడు 9 నెలలు దాటేసింది. వారిని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన బోయింగ్కు చెందిన స్టార్లైనర్ క్యాప్సూల్ గత ఏడాదే భూమికి తిరిగి వచ్చింది.ఇద్దరు అమెరికా వ్యోమగాములు, జపాన్, రష్యాకు చెందిన ఒక్కొక్క వ్యోమగాములతో కూడిన నలుగురు సభ్యుల బృందంతో కేప్ కెనవెరాల్లోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ఎక్స్ క్రూ-10 రాకెట్ని స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 7.48 గంటలకు ప్రయోగించాల్సి ఉంది. కానీ.. కౌంట్డౌన్ సమయంలో రాకెట్ లాంచ్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. హైడ్రాలిక్ సిస్టెమ్లో సమస్యలు ఇందుకు కారణం. ఈ రాకెట్ లాంచ్ మళ్లీ ఎప్పుడు ఉంటుందో స్పేస్ఎక్స్ ప్రకటించలేదు!స్పేస్లో చిక్కుకుపోయిన వ్యోమగాములను త్వరగా తీసుకురావాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, స్పేస్ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ విజ్ఞప్తి చేయడంతో.. ఈ రాకెట్ లాంచ్ని రెండు వారాల ముందుకు తీసుకొచ్చింది నాసా.తొలుత మార్చ్ 26న క్రూ-10 ప్రయోగాన్ని నాసా షెడ్యూల్ చేసింది. కానీ రెడీగా ఉన్న స్పేస్ఎక్స్ క్యాప్సూల్ని స్వాప్ చేయడం ద్వారా మిషన్ను వేగవంతం చేసింది. కొత్త సిబ్బంది ఐఎస్ఎస్కి చేరుకున్న తర్వాత, విల్మోర్- విలియమ్స్, నాసా వ్యోమగామి నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్.. ఇప్పటికే సెప్టెంబర్ నుంచి ఐఎస్ఎస్లో ఉన్న (క్రూ -9 మిషన్) క్యాప్సూల్ ఉపయోగించి భూమికి తిరిగి వస్తారు.బోయింగ్ స్టార్లైనర్ని పరీక్షించిన తొలి వ్యోమగాములుగా విల్మోర్, విలియమ్స్ జూన్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. అయితే, ప్రొపల్షన్ సిస్టమ్ పనిచేయకపోవడం వల్ల వారు స్పేస్క్రాఫ్ట్లో తిరిగి రావడం చాలా ప్రమాదకరంగా మారింది. అందుకే ఐఎస్ఎస్లో ఉండిపోయారు. దీనికి బదులుగా స్పేస్ఎక్స్ క్యాప్సూల్లో వారిని భూమి మీదకు రప్పించాలని నాసా నిర్ణయించింది.స్టార్లైనర్ అభివృద్ధి 2019 నుంచి నిరంతర సాంకేతిక సమస్యలు, బడ్జెట్ పెరుగుదలను ఎదుర్కొంది. ఇది ప్రోగ్రామ్ని గణనీయంగా ఆలస్యం చేసింది. దీనికి విరుద్ధంగా, కనీసం 4 బిలియన్ డాలర్ల విలువైన నాసా ఒప్పందం కింద అభివృద్ధి చేసిన స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్ చాలా సంవత్సరాలుగా పనిచేస్తోంది. ప్రస్తుతం ఐఎస్ఎస్కి సిబ్బందిని పంపించేందుకు ఉపయోగంలో ఉన్న ఏకైక యూఎస్ వ్యోమనౌకగా ఈ స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్.చాలా నెలల తర్వాత భూమి మీదకు తిరిగి వస్తుండటంతో సునీతా విలియమ్స్ చాలా ఎగ్జైట్ అయ్యారు. కానీ ఇప్పుడు మిషన్ వాయిదా పడింది!

# రూ.1000 కోట్ల లిక్కర్ స్కామ్..
# స్టాలిన్ సర్కార్పై బీజేపీ సంచలన ఆరోపణ



**చెన్నై:** ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.1000 కోట్ల లిక్కర్ కుంభకోణానికి పాల్పడిందని బీజేపీ సంచలన ఆరోపణ చేసింది. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ జరిపిన దాడుల్లో ఆర్థిక అవకతవకలు జరిగినట్టు వెల్లడైందని చెప్పింది. లిక్కర్ స్కామ్ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే త్రిభాషా విధానంపై స్టాలిన్ వదంతులు వ్యాప్తి చేస్తున్నారని విమర్శించింది. కాగా, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని డీఎంకే కొట్టివేసింది. తమిళనాడు ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారంనాడు 2025-26 బడ్జెట్ను ప్రవేశపెట్టింది. ఈ తరుణంలోనే బీజేపీ తాజా ఆరోపణలకు దిగింది. రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెనరసు వివిధ సంక్షేమ పథకాలను బడ్జెట్లో ప్రవేశపెట్టారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉపాధి కల్పన, మౌలిక వసతుల అభివృద్ధికి కీలక కేటాయింపులు జరిపారు.ఈ సందర్భంగా ఈడీ దాడుల్లో ఆర్థిక అవకతవకలు, లిక్కర్ స్కామ్ వెలుగుచూసినట్టు అన్నాడీఎంకే సభ్యులు ఆరోపిస్తూ, ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభనుంచి సభ్యులు వాకౌట్ చేశారు.

**బీజేపీ ఆరోపణ**

కాగా, లిక్కర్ మంత్రి, లిక్కర్ సప్లయ్ కంపెనీలపై ఈడీ దాడులు జరుగుతున్నందున ప్రజల దృష్టిని మళ్లించేందుకు త్రిభాషా విధానం, ఎన్ఈపీపై స్టాలిన్ తప్పుడు వదంతలను ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈడీ దాడుల్లో డిస్టిలరీల నుంచి ముడుపుల రూపంలో వసూలై, లెక్కల్లో చూపించని రూ.1,000 కోట్ల లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోందని, ఈ అక్రమ చెల్లింపులు ఎవరు అందుకున్నారో సీఎం వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాగా, లిక్కర్ స్కామ్ ఆరోపణలపై రూల్ 55 కింద సభలో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ అసెంబ్లీ స్పీకర్కు లేఖ రాశారు.

**మంత్రి సెంథిల్ వివరణ**

కాగా, టీఏఎస్ఎంఏసీ ఆపరేషన్స్లో అవకతవకలకు అవకాశమే లేదని తమిళనాడు ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తెలిపారు. సోదాల పేరుతో ఈడీ దాడులు చేసినప్పటికీ ఏ సంవత్సరంలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారో చెప్పలేదన్నారు. టీఏఎస్ఎంఏసీ రిక్రూట్మెంట్లో పొరపాట్లు జరిగి ఉండవచ్చనే అభిప్రాయంతో లేనిపోని ఆరోపణలకు దిగడం సరికాదన్నారు. గత నాలుగేళ్లుగా బార్ టెండర్ల ప్రక్రియ ఆన్లైన్లోనే జరుగుతోందని, ఏ ఆధారంతో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని వారు చెబుతున్నారని విపక్షాలను ప్రశ్నించారు. టీఏఎస్ఎంఏసీ టెంబర్లో అవకతవకలకు ఆస్కారమే లేదని ఆయన స్పష్టం చేశారు.

# అక్కడ పది రోజులపాటు హెూలీ వేడుకలు

**నవసారి:** దేశవ్యాప్తంగా హెూలీ వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి. చిన్నాపెద్దా అంతా ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ ఆనందిస్తున్నారు. దేశంలో ఎక్కడైనా హెూలీ వేడుకలు ఒకరోజు జరుగుతాయి. కానీ ఆ ప్రాంతంలో ఏకంగా 10 రోజుల పాటు హెూలీ వేడుకలు కొనసాగుతాయి. గుజరాత్లోని ఆదివాసీ జనబాహుళ్యం కలిగిన డాంగ్ జిల్లాలో హెూలీ ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. డాంగ్ జిల్లాలో జరిగే హెూలీని రాజుల హెూలీగా చెబుతారు. డాంగ్ జిల్లాలో నేటికీ ఐదుగురు రాజవంశస్థులు ఉన్నారు. ఏడాదిలో ఒకసారి ఈ రాజులను బహిరంగంగా గౌరవపూర్వకంగా సన్మానిస్తారు. పది రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. దీనిని డాంగ్ దర్బార్ మేళా అని అంటారు. ఈ ఉత్సవాల్లో ఆ రాజులను రథాలలో కూర్చోబెట్టి వేదిక దగ్గరకు తీసుకువచ్చి, ఘనంగా సన్మానిస్తారు. వీరికి ప్రభుత్వం ఫించను అందజేస్తుంది. పది రోజుల పాటు జరిగే హెూలీ వేడుకల్లో ప్రతీరోజూ ఇక్కడి ఆదివాసీ మహిళలు సాయంత్రం వేళల్లో జానపద గీతాలు ఆలపిస్తారు. అలాగే పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ప్రాంతలోని చిన్నారులు తమ మేనమామలకు హెూలీ స్నానం చేయిస్తారు. చిన్నారులను స్థానికులు భక్త ప్రహ్లాదుని రూపాలుగా భావించి పూజలు చేస్తారు.



## కేంద్రం 2150 కోట్లు ఇవ్వడం లేదు..

**చెన్నై:** తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరాసు ఇవాళ రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. తమకు రావాల్సిన సుమారు 2150 కోట్ల ను కేంద్రం రిలీజ్ చ్యేడం లేదని ఆరోపించారు. హిందీ భాష అమలు వివాదం నేపథ్యంలో.. కేంద్రం మోసానికి పాల్పడినట్లు విమర్శించారు. శుక్రవారం బడ్జెట్ ప్రసంగంలో మంత్రి తెన్నరాసు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా స్కీమ్ కింద అందాల్సిన 2150 కోట్ల నిధుల్ని కేంద్రం రిలీజ్ చేయడంలేదన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమలు విషయంలో తమిళనాడులోని డీఎంకే సర్కారు, కేంద్రం మధ్య వివాదం చెలరేగుతున్న విషయం తెలిసిందే. తమినాథు ప్రభుత్వం ద్విభాషా విధానం అమలు చేయడానికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి తెలిపారు. తమ విధానం తమను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిందని, ఆ విధానం వల్లే ప్రపంచవ్యాప్తంగా తమిళులు రాణిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లను నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులను వాడనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రభావం పడకుండా ఉండేందుకు.. ఉద్యోగుల జీతాల కోసం నిధుల్ని ఉంచినట్లు చెప్పారు. బడ్జెట్ను నిరసిస్తూ బీజేపీ ఇవాళ అసెంబ్లీని బాయ్కాట్ చేసింది. ఇక అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు.. సభ నుంచి వాకౌట్ చేశారు.

## ఉగ్రవాదానికి కేంద్ర స్థానం ఎవరో ప్రపంచానికి తెలుసు...
# పాక్కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్



**న్యూఢిల్లీ:** పాకిస్థాన్కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని భారత్ ప్రోత్సహిస్తోందంటూ ఆదేశం చేసిన ఆరోపణలను భారత్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. పాకిస్థాన్ చేస్తున్న నిరాధార ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్ధీర్ జైశ్వాల్ చెప్పారు. "ఉగ్రవాదానికి కేంద్రం ఎక్కడుందో యావత్ ప్రపంచానికి తెలుసు. ఇతరుల వైపు వేలెత్తి చూపించే ముందు తమ అంతర్గత సమస్యలపై ఆ దేశం దృష్టిసారిస్తే బాగుంటుంది" అని పాక్కు ఘాటు సమాధానమిచ్చారు. దీనికి ముందు, రైలు హైజాక్ వెనుక ఆఫ్ఘనిస్థాన్ హస్తం ఉందని తమ వద్ద బలమైన ఆధారాలు ఉన్నట్టు పాక్ విదేశాంగ ప్రతినిధి షౌకత్ అలీ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. దీనిపై మీడియా ఆయనను ప్రశ్నిస్తూ, గతంలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఏ అఘాయిత్యానికి పాల్పడినా భారత్ వైపు చూపించేదని, ఇప్పుడు పాక్ విదేశాంగ విధానంలో ఏదైనా మార్పు ఉంటుందా అని ఆ దేశ విదేశాంగ ప్రతినిధి షౌకత్ అలీ ఖాన్ను మీడియా ప్రశ్నించినప్పుడు "మా విధానంలో ఎలాంటి మార్పు లేదు" అని ఆయన స్పష్టం చేశారు. భారత్ మీడియా ఒకరకంగా బీఎల్ను కీర్తిస్తోందని, అది అధికారికంగా కాక పోయినా ఆ దేశ విదేశాంగ విదానాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. పాకిస్థాన్ లో టెర్రరిజాన్ని ఇండియా ప్రోత్సహి స్తోందని, అయితే జాఫర్ ఎక్స్ప్రెస్పై దాడి ఘటనలో ఉగ్రవాదులు ఆఫ్ఘనిస్థాన్లోని ఉగ్రవాదులను కాంట్రాక్ట్ చేశారని అలిఖాన్ అన్నారు. భారత్ పొరుగుదేశాలను అస్థిర పరచేందుకు ప్రయత్నిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా హత్యాకాండకు పాల్పడుతోందని తీవ్ర ఆరోపణ చేశారు. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్ప్రెస్ను బీఎల్ఏ వేర్పాటువాదులు హైజాక్ చేసి పలువురు ప్రయాణికులను బందీలుగా పట్టుకుంది. బలోచ్ మిలిటెంట్లను 33 మందిని హతమార్చినట్టు పాక్ ఆర్మీ ప్రకటించుకుంది. అయితే, ఇందుకు సంబంధించిన ఫోటోలను కానీ, ఆపరేషన్ సక్సెస్ అయిందా లేదా అనే దానిని గానీ ఇంతవరకూ నిర్ధారించలేదు.

## మహాత్మా గాంధీ మునిమనవడు వివాదాస్పద వ్యాఖ్యలు



**తిరువనంతపురం :** స్వాతంత్ర్య సమరయోధుడు, జాతిపిత మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీని అరెస్ట్ చేయాలని అటు ఆర్ఎస్ఎస్, ఇటు బీజేపీ డిమాండ్ చేస్తుంది. అరెస్ట్తో సరిపెట్టడం కాదు. తప్పని సరిగా తమకు క్షమాపణలు చెప్పాల్సిందేనని భీష్మిస్తున్నాయి. తుషార్ గాంధీ ఇటీవల కేరళ రాజధాని తిరువనంతపురంలోని నెయ్యంట్టికరలో గాంధీ సిద్ధాంతవాది పి.గోపీనాథన్ నాయకర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్లపై విమర్శలు గుప్పించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రెండూ సమాజానికి ప్రమాదకరం, శత్రులని అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ నిలువెల్లా విషం నింపుకుందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. స్థానిక బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాదులు తుషార్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన్ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే,ఇదే అంశంపై తుషార్ గాంధీ ప్రస్తావించారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడుతున్నట్లు చెప్పారు. చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవడం, క్షమాపణలు చెప్పబోమని అన్నారు. ఈ సంఘటన నా సంకల్పాన్ని మరింత బలపరచిందన్నారు.

## మాజీ ఎమ్మెల్యేపై కాల్పులు



బిలాస్పూర్లో కాల్పుల కలకలం రేగింది. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే బంబర్ ఠాకూర్పై గుర్తు తెలియని దుండగులు 12 రౌండ్ల కాల్పులు జరిపారు. శుక్రవారం.. బిలాస్పూర్లోని తన నివాసంలో జరిగిన ఈ కాల్పుల్లో ఠాకూర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనతో పాటు సెక్యూరిటీ అధికారి కూడా గాయపడ్డారు. ఈ ఘటనలో ఆయన కాలుకు బుల్లెట్ దిగినట్లు సమాచారం. ఈ దాడి ఎవరు చేశారనేదానిపై ఇంకా పూర్తి వివరాలు తెలియరాలేదు. ఠాకూర్ను మొదట సురక్షిత ప్రదేశానికి తరలించగా, ఆయన పీఎస్ఓను నేరుగా ఆసుపత్రికి తరలించారు. తరువాత, ఠాకూర్ను కూడా ఆసుపత్రిలో చేర్చారు. ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం బిలాస్పూర్ ప్రాంతీయ ఆసుపత్రి నుండి ఎయిమ్స్ బిలాస్పూర్కు తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## రెచ్చిపోయిన గ్రామస్తులు.. పోలీసులపై దాడి.. ఏఎస్ఐ మృతి



**పాట్నా:** ఓ ఊరి గ్రామస్తులు దారుణానికి ఒడిగట్టారు. ఊర్లో పెళ్లి చేసుకుంటున్న క్రిమినల్ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులపై దాడుల చేశారు. గ్రామస్తులు చేసిన దాడుల్లో ఏఎస్ఐ దుర్మరణం పాలయ్యారు. బీహార్ రాష్ట్రం, అరారియా జిల్లా ఫుల్కహా అనే గ్రామంలో అన్మోల్ యాదవ్ ఓ పేరు మోసిన క్రిమినల్. పలు నేరాలకు పాల్పడి.. పోలీసులు కళ్లు గప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. అయితే ఈ క్రమంలో బుధవారం అన్మోల్ యాదవ్ తన స్వగ్రామంలో పెళ్లి చేసుకుంటున్నాడనే సమాచారం పోలీసులకు అందింది. వెంటనే ఫుల్కహా గ్రామంలో పోలీసులు మోహరించారు. పెళ్లి చేసుకుంటున్న క్రిమినల్ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో గ్రామస్తులు రెచ్చిపోయారు. పోలీసులపై దాడులకు తెగబడ్డారు. దాడుల్లో ఏఎస్ఐ రాజీవ్ రంజన్ మాల్ దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయాడు. అప్రమత్తమైన పోలీసులు రాజీవ్ రంజన్ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో ఏఎస్ఐ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్పీ అంజన్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఆరుగురు ఆనుమోల్ యాదవ్ మద్దతుదారుల్ని అరెస్ట్ చేశారు. అనుమోల్ యాదవ్ను అదుపులోకి తీసుకుని విచారణ ముమ్మరం చేశారు

## జమ్మూకశ్మీర్లో యాక్టివ్గా విదేశీ ఉగ్రవాదులు



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో ప్రస్తుతం 60 మంది విదేశీ ఉగ్రవాదులు యాక్టివ్గా ఉన్నట్లు ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. దీంట్లో 35 మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులే ఉన్నారు. కశ్మీర్లో జరుగుతున్న చొరబాటుదారుల హింసలో 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నట్లు పేర్కొన్నారు. విదేశీ ఉగ్రవాదుల జాబితాలో.. లష్కరే తోయిబాతో పాటు జేష్ ఏ మొహమ్మద్, హిజ్బుల్ ముజాయిద్దీన్ తీవ్రవాదులు కూడా ఉన్నారు. యాక్టివ్గా ఉన్నవారిలో 21 మంది జేషై మొహమ్మద్, ముగ్గురు హిజ్బుల్ వ్యక్తులు ఉన్నారు. యాక్టివ్గా ఉన్న 17 మంది స్థానికుల్లో.. 14 మంది శ్రీనగర్ నుంచి ఆపరేట్ చేస్తున్నారు. మరో ముగ్గురు జమ్మూ సెక్టార్ నుంచి యాక్టివ్గా ఉన్నారు.

# సీనియర్-జూనియర్.. అలాంటి భాషతో నష్టం ఎవరికో?



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు మరీ పరుషంగా ఉన్నాయి. అంత అర్థవంతంగానూ కనిపించడం లేదు అవి. కేసీఆర్‌ను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని అనుకుంటున్నారా? లేక ఇంకేదైనా కారణం ఉందా?. ప్రస్తుతానికి కేసీఆర్ కూడా బీఆర్ఎస్ శాసనసభ పక్ష సమావేశంలో మాట్లాడుతూ.. రేవంత్‌కు అనుభవం, జ్ఞానం లేదని, కామన్ సెన్స్ వాడరు అంటూ వ్యాఖ్యానించి సరిపెట్టుకున్నారు. అంతకుమించి రేవంత్ వ్యాఖ్యలకు నేరుగా స్పందించ లేదు. అయితే..

ఆయన కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీష్‌రావులు మాత్రం రేవంత్ వ్యాఖ్యలకు ధీటుగానే జవాబిస్తున్నారు. అయితే తెలంగాణలో మూడు పార్టీల రాజకీయం కొంత గందరగోళంగానే ఉందని చెప్పాలి. ఎవరు ఎవరికి రహస్యంగా మద్దతు ఇస్తున్నారో ప్రజలకు అర్థం కాని రీతిలో రాజకీయం సాగుతోంది. "కేసీఆర్‌ను కొట్టింది నేనే.. గద్దె దింపింది నేనే" అంటూ మరీ రేవంత్ రెడ్డి(%=వఝుత్ప్ర =వ౹౹ఎ%) కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాకపోవచ్చు. రాజకీయాలలో గెలుపు ఓటములు ఉంటాయి. అంతమాత్రాన వ్యక్తుల గౌరవాలను తగ్గించుకునేలా మాట్లాడుకుంటే రాజకీయాల విలువ కూడా తగ్గుతుంది. ఎల్లకాలం ఎవరూ ఒకరే ముఖ్యమంత్రిగా ఉండరన్న వాస్తవాన్ని అంతా గుర్తుంచుకోవాలి. పార్లమెంటు ఎన్నికలలో గుండు సున్నా ఇచ్చింది తానేనని రేవంత్ అన్నారు. ఆ ఎన్నికలలో కారణం ఏమైనా బీఆర్ఎస్ ఓటమి అనేది వాస్తవం. కాంగ్రెస్‌తోపాటు బీజేపీకి కూడా ఎనిమిది లోక్ సభ స్థానాలు వచ్చాయి. అది కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా? అనేది ఆలోచించుకోవాలి. అప్పట్లో కాంగ్రెస్ ఓటమి లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేయడం వల్ల బీజేపీకి కొంత ఉపయోగం జరిగిందన్న భావన కూడా లేకపోలేదు. ఒకవేళ భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటే అది కాంగ్రెస్‌కు ఇబ్బంది కావొచ్చు. కాని ఆ పరిణామం జరుగుతుందని ఇప్పటికైతే ఎవరూ చెప్పలేరు. రేవంత్ నిజంగానే తాను బాగా బలపడ్డాడనని భావిస్తుంటే.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి సవాల్ విసిరి గెలిస్తే ఆయన ప్రతిష్ట పెరుగుతుంది. కాని కేసీఆర్(%ఖజ=%)ను విమర్శిస్తూ, ఆయన చేసిన తప్పులే రేవంత్ చేయడం వల్ల ఉపయోగం ఏమి ఉంటుంది?. తనది ముఖ్యమంత్రి స్థాయి అని, కేసీఆర్‌ది మాజీ ముఖ్యమంత్రి స్థాయి అని రేవంత్ అంటున్నారు. కాని కేసీఆర్ ప్రధాన కేసీఆర్ వయసు రీత్యా, అనుభవం రీత్యా తనకన్నా బాగా చిన్నవాడైన రేవంత్‌తో పోటీ పడడానికి చిన్నతనంగా భావిస్తున్నట్లు అనిపిస్తోంది. ఇది కూడా కరెక్టు కాదు. రాజకీయాలలో సీనియర్, జూనియర్ అని ఉండదు. ఎవరు అధికారంలోకి వస్తే వారిదే పవర్. కేసీఆర్‌ను ఉద్దేశించి ఉదయం నుంచి సాయంత్రం వరకు తాగితే స్థాయి వస్తుందా? అనడం అంత మంచి సంప్రదాయం కాదు. ఎవరిని లక్ష్యంగా అన్నారో కాని, డ్రగ్స్ పెట్టుకుని పార్టీ చేసుకుంటే స్థాయి వస్తుందా? అనడంలో అంతర్యం ఏమిటో తెలియదు. తెలంగాణ సమాజాన్ని విలువల వైపు నడపవలసిన నేతలు ఇంత తక్కువ స్థాయిలో మాట్లాడుకోవడం జనానికి రుచించదనే చెప్పాలి. కేసీఆర్ స్థాయి కాంగ్రెస్‌లో ఎవరికీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనడంపైనే రేవంత్ స్పందించి ఉండవచ్చు. కేటీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టడం తప్పుకాదు. ఆ సందర్భంలో వాడే భాష విషయంలో జాగ్రత్తగా లేకపోతే రేవంత్‌కే నష్టం. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి ఉందని రేవంత్ అంటున్నారు. అదే టైమ్‌లో కేటీఆర్, హరీష్ రావులు అప్పులపై సీఎం అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శిస్తూ కొన్ని ఆధారాలు చూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికలలో గెలవడానికి చేసిన హామీలకు అయ్యే వ్యయం ఎంత? ఏ మేరకు హామీలు అమలు చేశారు? మొదలైన విషయాలు చెప్పగలిగితే అధికార పార్టీపై ప్రజలలో విశ్వాసం ఏర్పడుతుంది. రేవంత్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రుణమాఫీ, రైతు బంధు, గ్యాస్ బండలు, గృహజ్యోతి వంటి స్కీముల అమలుకు కొంత ప్రయత్నం చేస్తున్న మాట నిజం. కానీ అమలు కానివి చాలానే ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు సహజంగానే వాటిని ఎత్తిచూపే ప్రయత్నం చేస్తాయి. ఆ విషయాలను డైవర్ట్ చేయడానికి రేవంత్, ఇతర కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నట్లుగా ఉంది. అందుకే కేసీఆర్‌పై వ్యక్తిగత స్థాయిలో నిందలకు పాల్పడుతున్నారన్న అభిప్రాయం కలుగుతోంది. రేవంత్ తరచుగా ఢిల్లీకి వెళ్లడాన్ని బీఆర్ఎస్ తప్పు పడుతోంది. దానికి జవాబుగా 39 సార్లు కాదు.. 99 సార్లు వెళతానని రేవంత్ అన్నారు. గతంలో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ నేతలు తరచు ఢిల్లీ వెళ్లడమే పెద్ద అంశంగా.. అప్పుడే కొత్తగా వచ్చిన టీడీపీ మార్చింది. ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ దాన్ని ఆత్మగౌరవ సమస్యగా మార్చి ప్రజలను తనవైపునకు తిప్పుకున్నారన్న సంగతిని రేవంత్ దృష్టిలో పెట్టుకుంటే మేలు. కేసీఆర్ గతంలో కంచి వెళుతూ తిరుపతి వద్ద అప్పటి మంత్రి రోజా ఇంటిలో విందు తీసుకున్నప్పుడు కేసీఆర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాయలసీమను రతనాల సీమను చేస్తానని చెప్పి రొయ్యల పులుసు తిన్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. ఇప్పుడు ప్రాంతీయ భావాలు అవసరమా? అంటే రాజకీయంలో ఇవి సాధారణంగానే జరుగుతుంటాయి. దానికి పోటీగా చంద్రబాబు(%జష్టుఅ౹తీఝఝఎబ%)కు ప్రజాభవన్‌లో విందు ఇచ్చి, ఆయన వద్ద రేవంత్ సాగిలపడ్డారని హరీష్ రావు విమర్శించారు. కరీంనగర్‌లో ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడంపై రేవంత్‌కు అసంతృప్తి ఉండవచ్చు. దానిని రాజకీయంగా విమర్శించవచ్చు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి ఓడించాయని, హరీష్‌రావు డబ్బులు ఇచ్చి మరీ బీజేపీకి ఓట్లు వేయించారని ఆయన అన్నారు, ఈ రోజుల్లో ఎవరి వ్యూహం వారిది అనుకోవాలి. బీఆర్ఎస్ తనకు ప్రత్యర్థి కాంగ్రెస్ అని భావిస్తూ ప్రస్తుతం పరోక్షంగా బీజేపీకి సహకరించి ఉండొచ్చు!. అయితే భవిష్యత్తులో అది బీఆర్ఎస్‌కు ఉపయోగపడవచ్చు.. పడకపోవచ్చు!!. మరో వైపు ప్రధాని మోదీని మెచ్చుకునే రీతిలో మాట్లాడి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వల్ల తెలంగాణకు నష్టం జరుగుతోందని రేవంత్ అనడాన్ని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. "యూజ్ లెస్ ఫెలో, హౌలే గాడు మాట్లాడే మాటలు పట్టించుకోనవసరం లేదు.." అంటూ బీఆర్ఎస్‌కు ఘాటైన రీతిలో సమాధానం చెప్పడం.. ఈ క్రమంలో అనుచిత భాష వాడడంలో సహేతుకత కనిపించదు. ఒకప్పుడు కేసీఆర్ అభ్యంతరకర భాష వాడుతున్నారన్న విమర్శలు ఉండేవి. దానికి పోటీగా పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ తీవ్రమైన విమర్శలే చేసేవారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా కేసీఆర్‌ను మించి దూషణల పర్వం వాడడం వల్ల ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ వ్యక్తిత్వానికి, గౌరవానికి అంత హుందా కాకపోవచ్చు.

# రేవంత్ పార్టీ మారతారా?

-మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యత ఇస్తున్నారు అనే ప్రచారం కూడా జరిగింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి కలిసి సందర్భంగా బయటికి వచ్చిన ఫోటోలు, కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసాయి. గత పదేళ్ళలో ఏ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి గాని ఇతర ప్రతిపక్షాల ముఖ్యమంత్రులు గాని.. ఈ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో నవ్వుతూ మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువ. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయనకు అపాయింట్మెంట్ ఇచ్చే వారు కాదు. దీనిపై చంద్రబాబు నాయుడు బహిరంగంగా ఎన్నోసార్లు విమర్శలు చేసిన పరిస్థితి కూడా ఉంది. అలాంటిది రేవంత్ రెడ్డి పదేపదే వెళ్లి కేంద్ర మంత్రులను, ప్రధానమంత్రిని కలవడాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా సీరియస్ గానే తీసుకుంటున్నారు. ఇక రాష్ట్రంలో కూడా రేవంత్ రెడ్డికి పరిస్థితులు అనుకూలంగా కనపడలేదు. కొంతమంది కాంగ్రెస్ నేతలు ఆయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు ప్రభుత్వ పనితీరుపై బహిరంగంగానే వ్యాఖ్యలు చేయడం.. ఈ మధ్యకాలంలో సంచలనం అవుతుంది. ఈ తరుణంలో రేవంత్ రెడ్డి బిజెపి నేతలతో స్నేహం చేయడం సంచలనంగా మారింది. త్వరలోనే ఆయన కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పే అవకాశాలు ఉండవచ్చు అనే ప్రచారం కూడా గట్టిగానే జరుగుతుంది. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కూడా రేవంత్ రెడ్డిని కాస్త దూరం పెడుతుంది అనే వార్తలు వచ్చాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం సంచలనమైంది. అయితే ప్రస్తుత పరిస్థితులను రేవంత్ రెడ్డికి అసలు సీరియస్ గా తీసుకుని విసిగిపోయినట్లు సమాచారం. సీనియర్ నేతలు ఎన్నికల ముందు కాస్త సహకరించినా.. ఎన్నికల తర్వాత మంత్రి పదవులు తీసుకుని కూడా, తనకు సహకరించడం లేదు అనే కోపంలో రేవంత్ రెడ్డి ఉన్నారుఅందుకే ఆయన కాంగ్రెస్ పార్టీ కంటే బిజెపితోనే ఎక్కువగా స్నేహం చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. బిజెపి నేతలతో కూడా రాష్ట్రంలో రేవంత్ రెడ్డికి మంచి పరిచయాలు ఉన్నాయి. దీనితో ఆయన కచ్చితంగా కమలం పార్టీలో జాయిన్ అయ్యే అవకాశాలు ఉండవచ్చు అనే వార్తలు వస్తున్నాయి.



### ప్రచారానికి ఫుల్ స్టాప్

మరో వైపు తెలంగాణలో సీఎం మార్పు లేదని క్లారిటీ ఇచ్చారు. కాంగ్రెస్ హైకమాండ్‌తో ఏదైనా సాధించుకునే సత్తా తనకు ఉందన్నారు. తాను ఎవరి ట్రాప్‌లో పడనన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ ప్రచారంలో వాస్తవం లేదని సీఎం రేవంత్ కొట్టిపారేశారు. ప్రభుత్వం, పార్టీపై తనకు పూర్తి పట్టు ఉందని చెప్పుకొచ్చారు. గాంధీ ఫ్యామిలీకి రేవంత్ రెడ్డి మధ్య చాలా గ్యాప్ పెరిగిందంటూ ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. గాంధీ ఫ్యామిలీతో దూరం పెరగడం వల్లే ఆయనకు అధిష్టానం కనీసం అపాయిట్మెంట్ ఇవ్వడం లేదని వార్తలు వచ్చాయి. సీఎం రేవంత్ ఈ వార్తలను తీవ్రంగా ఖండించారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. అధిష్టానాన్ని కలిసినట్టుగా ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. నేను ఎవరో తెలియకుండానే పార్టీ పీసీసీ చీఫ్, సీఎంను చేశారా? అంటూ సూటిగా సీఎం రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ నేతలు అడ్డం పడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి పట్టించుకోవడం లేదని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందని అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలని సీఎం రేవంత్ కోరారు.

## సైకిల్ ఎంట్రీ.. మారనున్న గేర్

-మొదటిపేజీ తరువాయి

కూడా గాంధీ భవన్ వైపు మొగ్గు చూపారన్న వాదనలో నిజముంది. 2023 శాసనసభ ఎన్నికల్లో హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి స్థానాలు దక్కకపోయినా ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాల్లో పార్టీకి సాలిడ్ గా సీట్లు రావడం కూడా టీడీపీ ఓటు బ్యాంకు సహకారం వల్లనేనన్నది కొందరి విశ్లేషణగా ఉంది. 2018లో మహా కూటమిలో కాంగ్రెస్ తో కలసి టీడీపీ పోటీ చేయడంతో అధికారంలోకి రాలేదన్న కామెంట్స్ కూడా నాడు వినిపించాయి. ఇప్పుడు బీజేపీతో పొత్తుతో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ రానుందన్న వార్తలు కారు పార్టీ నేతలకు ఖుషీ కబురుగా అనుకోవాల్సి ఉంటుంది. బీజేపీతో పొత్తు పెట్టుకున్నా టీడీపీని, కాంగ్రెస్ ను వేరుగా చూడలేరని, అందుకే ఈసారి ఎన్నికల్లో జనం తమ వైపు తిరుగుతారని గట్టి అంచనాలు వినపడుతున్నాయి. రానున్న కాలంలో కేసీఆర్ కూడా చంద్రబాబుపై విమర్శలు ఎక్కుపెట్టే అవకాశాలున్నాయి. అదే సమయంలో తెలంగాణ సెంటిమెంట్ ను కూడా మళ్లీ రగిలించే ప్రయత్నం చేస్తారు. ఇక్కడ బీజేపీ వచ్చినా, కాంగ్రెస్ వచ్చినా రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని, సాగునీరు కూడా అందని పరిస్థితి నెలకొంటుందని చెప్పి ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం గులాబీ బాస్ చేస్తారంటున్నారు. మొత్తం మీద టీడీపీ ఎంట్రీతో కారు పార్టీకే లాభమన్న విశ్లేషణలు బాగా వినపడుతున్నాయి.ల

## బీజేపీ నేతలతో రేవంత్ రహస్య భేటీల మర్మమేమి?



**హైదరాబాద్:** "గల్లీలో హోదాను మరిచి తిట్లు.. ఢిల్లీలో చిట్ చాట్లు" అంటూ సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాలు గడప దాటదు కానీ.. ఢిల్లీలో మాటలు కోటలు దాటుతున్నాయి అంటూ ట్వీట్ చేశారు. నీళ్లు లేక పంటలు ఎండి– పొలాలు బీడువారి అన్నదాతలు అరిగోస పడుతుంటే.. కనీసం సాగునీళ్లపై సమీక్ష లేకుండా ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నావ్ అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ నిలదీశారు. "39 సార్లు ఢిల్లీ పోయి మీడియా ముందు సెల్ఫ్ డబ్బా కొట్టుకునుడు తప్ప.. ఢిల్లీ నుంచి సాధించిన పని.. తెచ్చిన రూపాయి లేదు. రాహుల్ గాంధీతో నీ సంబంధాల గురించి తెలంగాణకు ఏం అవసరం.. మీ మధ్య సంబంధం ఉంటే మాకేంటి–ఊడితే మాకేంటి.. తెలంగాణకు ఒరిగేది ఏంటి?. గ్రామ గ్రామాన, గల్లీ గల్లీల్లో మీకు ఓటేసి మోసపోయాం అని జనం చివాట్లు పెడుతుంటే– చీమకుట్టినట్టు కూడా లేని నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నావ్.. మొహం బాగోలేక అద్దం పగలగొట్టినట్లు.. ఆడ లేక పాతగజ్జెలు అన్నట్లు. హామీల అమలు చేతగాక గాలి మాటలు.. గబ్బు కూతలు." అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. మరో ట్వీట్‌లో "బీజేపీ నేతలతో కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి రహస్య సమావేశాలా.. సిగ్గు.. సిగ్గు..!. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ ఈ చీకటి మీటింగులు పెట్టడమేంటి?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఇలాంటి దిక్కుమాలిన చిల్లర రాజకీయం తెలంగాణ నేలపై ఇంతవరకు ఎప్పుడూ లేదు. ఓ వైపు బయటకు బీజేపీ నేతలతో కుస్తీపడుతున్నట్టు ఫోజులు కొట్టి, దొంగచాటుగా దోస్తీ చేసే ఈ నీచ సంస్కృతికి తెరలేపడం అత్యంత దుర్మార్గం. ఏం గూడుపుఠాణి చేయడానికి ఈ తెరచాటు సమావేశాలు నిర్వహిస్తున్నారో ముఖ్యమంత్రికి దమ్ముంటే బయటపెట్టాలి" అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు. "పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేని సీఎంకు, ఈ రహస్య సమావేశాలకు మాత్రం టైమ్ దొరకడం క్షమించలేని ద్రోహం. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులున్నారని రంకెలు వేసే రాహుల్ గాంధీకి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్ రెడ్డిపై చర్య తీసుకునే ధైర్యం ఉన్నదా?. అట్టర్ ఫ్లాప్ ముఖ్యమంత్రిగా ముద్రపడి, ఇక ఏ క్షణంలోనైనా తన సీఎం కుర్చీ చేజారే సూచనలు కనిపించడం వల్లే చీఫ్ మినిస్టర్ బీజేపీతో ఈ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని ఆగంచేసి, డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో సహించదు. రెండు ఢిల్లీ పార్టీలకు కర్రుగాల్చి వాతపెడ్తది" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## 'కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలపై ఎటువంటి కుట్ర, కక్ష లేదు'

-మొదటిపేజీ తరువాయి



పుదుచ్చేరి లో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. కర్ణాటకలో గాల్లో దీపంలా సిద్దరామయ్య ప్రభుత్వం ఉంది. డీఎంకే ఆధ్వర్యంలో జరిగే అఖిల పక్షం మీటింగ్ కి రేవంత్, కేటీఆర్ పోటీ పడి హాజరు అయ్యేందుకు సిద్ధమయ్యారు. రేవంత్ ఇచ్చిన 420 హామీల పై అఖిల పక్షం మీటింగ్ పెట్టాలి. హామీలపై కాంగ్రెస్ ను నిలదీయాల్సిన బీ అర్ ఎస్ కాంగ్రెస్ తో కలిసి అఖిల పక్షం మీటింగ్ కి హాజరు అవ్వడం ఏంటీ?, డిలిమిటేషన్ రాజ్యాంగ బద్ధంగా జరిగే ప్రక్రియ. దీనికి రాజకీయాలు అంటగడతార?, బ్రిటిష్ నినాదం విభజించు – పాలించు ను కాంగ్రెస్ అనుసరిస్తుంది. గతంలో అధికార దుర్వినియోగం తో కాంగ్రెస్ బలవంతపు కుటుంబ నియంత్రణ చేపట్టింది. జనాభా తగ్గుదల పై కాంగ్రెస్ కు మాట్లాడే అర్హత లేదు ? , డిలిమిటేషన్ తో ఎస్సీ ఎస్టీలకు సీట్లు పెరుగుతాయి. మహిళలకు 33శాతం సీట్లు దక్కనున్నాయి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వొద్దని రేవంత్ అనుకుంటున్నారా? , కాంగ్రెస్ దొంగ ఏడుపులు ఏడుస్తూ.....జనాభా లెక్కలు అడ్డుకోవాలని చూస్తోంది. దేశాన్ని ఇండియా – పాకిస్తాన్ మాదిరిగా విభజించినట్టు సౌత్, నార్త్ అంటూ ప్రజలను మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న కాంగ్రెస్.. రేవంత్ 20 – 20 రాజకీయాలు చేయాలని మాట్లాడుతున్నారు. 20 – 20 మ్యాచ్ లో ఎన్నైనా అబద్ధాలు అడొచ్చా?, మొన్న జరిగిన ఢిల్లీ %%20 లో మిమ్మల్ని డకౌట్ చేశారు. %వీశ్రీష% ఎన్నికల్లో రేవంత్ డాకౌట్ అయ్యారు. ఎటువంటి మ్యాచ్ జరిగిన మోదీ సెంచరీలు మోత మోగిస్తున్నారు' అని ఎంపీ లక్ష్మణ్ స్పష్టం చేశారు.

## అడవిలో అగ్ని ప్రమాదం.. 60 గొర్రె పిల్లలు మృత్యువాత

ఊట్కూర్, మార్చి 14 : మండలంలోని ఓబులాపూర్ శివారు అడవిలో జరిగిన అగ్ని ప్రమాదంలో గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డ ఘటన చోటు చేసుకుంది. బాధిత గొర్రెల కాపరుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరులు కురువ అయ్యలప్ప, బలరాం, జన్నప్ప, ఎర్ర కొండప్ప, తిప్పన్న తమ గొర్రెలను మండలంలోని ఓబులాపురం శివారులో శుక్రవారం మేతకు వదిలారు. ఇదే క్రమంలో 70 వరకు గొర్రె పిల్లలను వెటర్నరీ అధికారి భీమ్ రెడ్డి వ్యవసాయ పొలంలో ఇనుప కంచె పెట్టి ఉంచారు. గొర్రె పిల్లలు కుక్కల బారిన పడకుండా రక్షణగా చుట్టూ పెద్ద మొత్తంలో ముళ్లకంచెను పెట్టడంతో ప్రమాదవశాత్తు ముళ్ళకంచెకు నిప్పంటుకొని దాదాపు 60 గొర్రె పిల్లలు ఘటనాస్థలిలోనే మృత్యువాత పడినట్లు యజమానులు తెలిపారు. గొర్రె పిల్లలు మృత్యువాత పడిన ఘటనలో యజమానులకు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మాదాసి కురవ సంఘం జిల్లా నాయకులు గోవిందప్ప, ఆశప్ప తెలిపారు.

# సంపాదకీయం

## పర్యావరణంపై నేతల నిర్లిప్తత

ప్రజలలో పర్యావరణం పట్ల పెరుగుతున్న స్పృహను ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ప్రతిబింబిస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేశారని పోల్‌స్టర్లు ప్రజలను అడిగినప్పుడు ఢిల్లీ గుండా వెళ్ళే 22 కి.మీ. పొడవునా యమునా నదిలో కాలుష్యం ప్రధాన సమస్యగా పేర్కొన్నారు. ఆ తర్వాత విషపూరిత వాయు కాలుష్యం, ఢిల్లీలో పేరుకుపోయిన చెత్తలను ప్రధాన సమస్యలుగా ప్రజలు ప్రస్తావించారు. ఇప్పటివరకు, పర్యావరణ సమస్యలు రాజకీయ పార్టీల మేనిఫెస్టోలలో మాత్రమే కనిపిస్తూ వచ్చాయి. కానీ బహుశా దేశంలో మొదటి సారిగా ఢిల్లీ ఎన్నికల్లో ఆయా సమస్యలపై ప్రజలు గళం విప్పారు. ఈ ప్రజా చైతన్యం దేశ పర్యావరణ వ్యవస్థలో తగు మార్పుకు దారితీస్తుందని ఆశిద్దాం. అయితే, మన ప్రభుత్వాలు, రాజకీయ నేతలు పర్యావరణ సమస్యలను పట్టించుకోవడం లేదని చెప్పలేం. అయినా ఈ సమస్యలు రోజురోజుకూ మరింత తీవ్రతరం ఎందుకు అవుతున్నాయో గమనించని పక్షంలో ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం ఉండదు. ఉదాహరణకు ఢిల్లీ యమునా కాలుష్యాన్ని తీసుకోండి. ఇప్పుడు ఢిల్లీలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం యమునా నది ప్రక్షాళన గురించి దృష్టి సారిస్తున్న సమయంలో ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలి. గతంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యమునా నదిని శుభ్రపరచడం గురించి తీవ్రంగా ఆలోచించలేదని చెప్పలేం. మురుగునీటి కాలువగా మారిన నదిని శుభ్రం చేయాలనే ఉద్దేశం అన్ని ప్రభుత్వాలు వ్యక్తం చేశాయి. పైగా, అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు ఖర్చు చేశాయి. అధికారిక అంచనా ప్రకారం, 2017 నుండి 2021 మధ్య నాలుగు సంవత్సరాలలో రూ. 6,500 కోట్లు ఖర్చు చేశారు. ఇది చాలా పెద్ద మొత్తం. కాబట్టి, పర్యావరణం ప్రభుత్వ నిబద్ధత లేదా నిధుల గురించిన సమస్య కాదని గ్రహించాలి. పైగా, నదిని శుభ్రం చేయడానికి ఒక ప్రణాళిక ఉంది. ఇది ఢిల్లీ గురించి కాబట్టి, సుప్రీం కోర్టు నుండి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వరకు దాదాపు ప్రతి కోర్టులో ఈ కార్యాచరణ ప్రణాళికను సమీక్షించడానికి క్రియాశీల కేసులు ఉన్నా యి. ప్రతి నెలా, రాష్ట్ర ప్రభుత్వం ఒక నివేదికను శ్రద్ధగా తయారు చేసి కోర్టులలో దాఖలు చేస్తున్నది. కాబట్టి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత గత ప్రభుత్వం ఏమీ చేయలేదని లేదా ఎవరూ పట్టించుకోలేదని భావించకూడదు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రదర్శించిన వాక్చాతుర్యం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన, కీలకమైన పరిగణించదగిన చర్యలకు పనికిరాదని గ్రహించాలి. నిధులు, ఆసక్తి, కార్యాచరణ ప్రణాళిక ఉన్నప్పటికీ, నది స్థితిలో స్పష్టంగా ఎందుకు మార్పు రావడం లేదో గ్రహించాలి. ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ దాఖలు చేసిన నెలవారీ నివేదికల ప్రకారం, చాలా నెలల్లో, నది నీటి నాణ్యత, పల్లా వద్ద నగరంలోకి ప్రవేశించేటప్పుడు లేదా వజీరాబాద్ వద్ద నీటిని తీసుకునే ప్రదేశం నుండి చాలా బాగుంటుంది. కానీ ఢిల్లీ గుండా దాని 22 కి.మీ ప్రయాణంలో కొన్ని కిలోమీటర్లలోనే అది చనిపోతుంది. వాస్తవం ఏమిటంటే, అది ప్రభావవంతంగా ఉండేలా కార్యాచరణ ప్రణాళికను తిరిగి రూపొందించాల్సిన అవసరం ఉంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) డైరెక్టర్ జనరల్ సునీతా నరైన్ ఇటీవల పర్యావరణం, అభివృద్ధి అంశాలపై రాసే భారతదేశానికి చెందిన జర్నలిస్టుల వార్షిక సమావేశం అనిల్ అగర్వాల్ డైలాగ్ 2025లో మాట్లాడుతూ, మన దేశంలో పర్యావరణ నిర్వహణ ఖరీదైనది, సమ్మిళితం కానిదని విచారం వ్యక్తం చేశారు. మనం 2025లో ముందుకు సాగుతున్న కొద్దీ మంచి, చెడు వార్తలు ఉన్నాయి. శుభవార్త ఏమిటంటే పర్యావరణ స్పృహ పెరిగింది. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన యమునా, వీధుల్లో చెత్త వంటి అంశాలపై ఓటర్లు ఆందోళన చెందుతున్న సమస్యలని వెల్లడైంది. ప్రభుత్వాలు పర్యావరణం కోసం కార్యక్రమాలను ప్రకటించాల్సి వచ్చింది అని ఆమె చెప్పారు. మరోవంక, రైతులు తమ నేల, నీటి గురించి శ్రద్ధ వహించడంబీ పరిశ్రమలకు ఎటువంటి సంఘర్షణలు లేకుండా వనరుల భద్రత అవసరమని గుర్తించడం జరుగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. అయితే, మనం తగినంత ప్రతిష్ఠాత్మకం కాని కార్యక్రమాలుబీ బలహీనమైన సంస్థలుబీ ఖరీదైన సమ్మిళితం కానీ పర్యావరణ నిర్వహణ మార్గంతో నిండి ఉన్నాం అని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సిఎస్ఇ విడుదల చేసిన “2025 స్టేట్ ఆఫ్ ఇండియాస్ ఎన్విరాన్‌మెంట్” నివేదిక ప్రకారం భారతదేశం నగరాల్లో 42 నగరాలు ప్రపంచంలోని 50 అత్యంత కలుషిత నగరాల్లో ఒకటిగా ఉన్నాయి. మన దేశంలోని మున్సిపల్ పాలన భారీ వైఫల్యాన్ని ఈ అనేకులు సూచిస్తున్నాయి. సూరత్, ఇండోర్ వంటి నగరాల విజయవంతమైన నమూనాలు ఉన్నప్పటికీ దేశంలో అత్యధికంగా నగరాలు పాలనా వైఫల్యానికి చిహ్నాలుగా మిగిలాయి. కాలక్రమేణా, నీటి సమస్యలు మరింత దిగజారిపోతున్నాయి. నీటిని పొదుపుగా మార్చాలని మనం గుర్తించాలి. మొత్తం నీటి సరఫరాను జాతీయం చేసి రేషన్ చేయాలి లేదా నీటికి తగినంత ధర నిర్ణయించాలి అని ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా సూచించారు. పరిశ్రమల విషయంలో కాలుష్యం, మురుగునీటి అంశాలపై ఎటువంటి రాజీ ఉండకూడదని ఆయన తేల్చి చెప్పారు. చిన్నవి లేదా పెద్దవి అనే దానితో సంబంధం లేకుండా కాలుష్య కారకం చెల్లించాలని సూచించారు. ఢిల్లీ కాలుష్యం విషయంలోనే మురుగు నీటి శుద్ధి కర్మాగారాల (ఎస్‌టిపిలు) నిర్మాణాన్ని ట్రాక్ చేయడంపై మాత్రమే కాకుండా, అడ్డగించి శుద్ధి చేయడానికి తీసుకున్న మురుగునీటి పరిమాణంపై కూడా దృష్టి పెట్టాలి. అంటే ఢిల్లీలోని పెద్ద ప్రాంతాలు భూగర్భ, నీటి వ్యవస్థలకు అనుసంధానించబడలేదని గుర్తించాలి. ఇక్కడ, పీపేజ్ నిర్వహణ కోసం ప్రజలు డీస్లడ్జింగ్ ట్యాంకర్లపై ఆధారపడటం తప్ప వేరే మార్గం లేదు. అయితే, ప్రజలు తమ సొంత మురుగునీటిని నిర్వహించుకుంటారు. దాని వల్లన మురుగునీటి పైపులైన్లను నిర్మించడం, పునరుద్ధరించడం, వాటిని అనుసంధానించబడని ప్రాంతాలకు విస్తరించడంలో ప్రభుత్వం పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఉండదు. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ వీటి సంఖ్య పెరుగుతోంది. జిపిఎస్ ట్యాంకర్ కదలికను పర్యవేక్షించడానికి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి. మరోవంక, ఉపయోగించిన నీరు, బురదను తిరిగి ఉపయోగించుకునేలా డీస్లడ్జ్ చేయబడిన పదార్థాన్ని ట్రీట్‌మెంట్ పాయింట్లకు తీసుకెళ్లడం ముఖ్యం. ‘శుద్ధి చేసిన’ మురుగునీటిని కాలువల్లోకి విడుదల చేయకుండా, అనధికారిక ప్రాంతాల నుండి శుద్ధి చేయని మురుగు నీటితో కలిపేలా ప్రణాళిక నిర్ధారించాలి. శుద్ధి చేసిన మురుగునీటిని పూర్తిగా తిరిగి ఉపయోగించే విధంగా రీసైకిల్ చేయాలి. ప్రస్తుతం, ఢిల్లీ ఆర్థిక సర్వే ప్రకారం, శుద్ధి చేసిన మురుగునీటిలో 10 శాతం కంటే తక్కువ మాత్రమే తిరిగి ఉపయోగిస్తున్నారు. చాలా ఎస్‌టిపిలు నది ఒడ్డున లేకపోవడంతో శుద్ధి చేసిన మురుగునీటిని నదికి శుద్ధి చేయని మురుగు నీటిని తీసుకువెళ్ళే అదే కాలువలలోకి విడుదల చేస్తున్నారు. దీని ప్రభావం నీటి నాణ్యతపై పడుతుంది. ప్రస్తుతం యమునా నది నుండి నీరు తీసుకొని, మురికి నీటిని తిరిగి ఇస్తున్నాం. తిరిగి నీరు మాత్రమే నదిలో ప్రవహించే విధంగా నీటి శుద్ధి ప్రణాళికలు ఉండాలి. కేవలం ఢిల్లీలో మాత్రమే కాదు అన్ని నగరాలు ఆ విధమైన ప్రణాళికలను అనుసరించాలి. అదే విధంగా పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణకు వృత్తాకార విధానం వనరుల పరిరక్షణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపులో పరివర్తనాత్మక పాత్ర పోషిస్తుందని ఈ నివేదిక వెల్లడిస్తుంది. ‘గుడ్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండస్ట్రియల్ వేస్ట్ సర్క్యులారిటీ’ అనే నివేదిక 2030 నాటికి 750 మిలియన్ టన్నుల పారిశ్రామిక వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకునే సామర్థ్యాన్ని ప్రస్తావించింది. 450 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ సహజ వనరులను ఆదా చేస్తుందని, 50–60 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ సమానమైన వ్యర్థాలను తొలగిస్తుందని తెలిపింది. వృత్తాకార ఆర్థిక సూత్రాలను అవలంబించడం వల్ల పారిశ్రామిక కార్యకలాపాల పర్యావరణ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అది కనుగొంది. పరిశ్రమలు భారతదేశ జిడిపిలో 30 శాతానికి పైగా దోహదం చేస్తాయి. సహజ వనరులను గణనీయంగా వినియోగించేవి, యు వ్యర్థాలను ఉత్పత్తి చేసేవి కావడంతో అవి కాలుష్యం, కార్బన్ ఉద్గారాలకు కూడా ప్రధాన వనరులు అని సునీతా నరైన్ తెలిపారు. మరోవంక, 2030 నాటికి ఐక్యరాజ్యసమితి భూమి క్షీణత ఎజెండాను నెరవేర్చడానికి, 77 జిల్లాల (వీటిలో 70 శాతం తూర్పు, దక్షిణ భారతదేశంలో ఉన్నాయి) భూమి కోతపై భారతదేశం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని నేచర్‌లో ప్రచురించబడిన 2025 శాస్త్రీయ నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా భూమి క్షీణిస్తోంది. ఈ భూమి కొత్త పంట భూములు, పొడి భూములు, చిత్తడి నేలలు, అటవీ, గడ్డి భూములతో అనుసంధానించిన జనాభాలో దాదాపు

# పతనావస్థలో ప్రజాస్వేచ్ఛ



తన ఇస్లాం వ్యతిరేకతను తెలపడానికి ఇరాకీ వలసజీవి సల్వాన్ మోమికాను భావప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూ స్వీడెన్ పోలీసులు 2023లో అనుమతించారు. అతను స్వీడెన్ సెంట్రల్ మసీదు బయట ఖురాన్‌ను కాల్చాడు. 29 జనవరి, 2025న మోమికాను రాజధాని స్టాక్‌హోంలో చంపారు. ఈ హత్యలో విదేశీ ప్రభావం ఉండచ్చని ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ అన్నారు. ఉప ప్రధాని ఎబ్బా బుష్ ఈ హత్యను ఖండించారు. ఇది మా పారదర్శక ప్రజాస్వామ్యానికి ముప్పన్నారు. నిందితులను అరెస్టుచేశారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో స్వీడెన్ రాయబారి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. స్వీడెన్ రాయబారిని నగరం నుంచి బహిష్కరించారు. ఇది 1988లో ‘సైతాను శ్లోకాలు’ నవల రాసినందుకు కక్షతో సల్మాన్‌రష్డీ పై 2022లో ఇరాన్ హత్యా ప్రయత్నం లాంటిది. స్వేచ్ఛావాద స్వీడెన్ సమాజంలో భావప్రకటన స్వేచ్ఛలో భాగమైనా మతద్వేషం అపాయమని, దాన్ని హింసతో అరికట్టాలని భావించారు. ఖురాన్ దహన నేరానికి స్వీడెన్ రాజ్యం శిక్షించే ముందు మోమికాను చంపారు. ఫిబ్రవరి 4 న మరో నిందితుడు సల్వాన్ నాజెమ్‌కు అప్పీల్ అవకాశంతో శిక్ష, 4 వేల క్రోనార్ల జరిమానా విధించారు. నిందితులు మతవిమర్శ పరిధి దాటారని కోర్టు వ్యాఖ్యానించింది. స్వీడెన్ 20 వ శతాబ్దంలో మతనింద వ్యతిరేక చట్టాలను వదిలేసింది. కొన్నేళ్ళుగా స్కాండినేవియన్ దేశాల్లో మతోన్మాదం పెరిగింది. ప్రభుత్వాలు భావప్రకటన స్వేచ్ఛను నియంత్రించాయి. గతేడాది డెన్మార్క్ మతనింద నిరోధ చట్టాలను పునరుద్ధరించింది. స్వీడెన్ మతవిద్వేష చట్టాలను అమలుచేస్తోంది. మత తాత్వికత, మత గ్రంథా లు, మత విమర్శలను అడ్డుకుంటోంది. ప్రపంచ మతవిద్వేష నియంత్రణ చట్టాలతో పోల్చితే స్వీడెన్ శిక్షలు తక్కువ. ఇరాన్ లాంటి దేశాల్లో మత విమర్శకు మరణదండనే. ఇంగ్లండ్ నిఘాను పెంచింది. 1984 లో పెద్దన్న మిమ్ము గమనిస్తున్నాడని టివిలలో ప్రజలను హెచ్చరించింది. అంతర్జాల ఆగడాలపై తీవ్ర చర్యలతో 2024లో సామాజిక మాధ్యమాలను కట్టడి చేసింది. యుకె పౌరుడు మార్టిన్ ఫ్రాస్ట్ కూతురును పాలస్తీనాపై యుద్ధంలో ఇజ్రాయెల్ చంపింది. మోమికా హత్యకు నిరసనగా ఫ్రాస్ట్ ఖురాన్‌ను కాల్చాడు. అతనిపై ప్రభుత్వం విచారణ చేస్తోంది. మతవిద్వేష నియంత్రణ చట్టాలను ఇంగ్లండ్ 2008లో రద్దు చేసింది. ఖురాన్ ముస్లింల పవిత్ర గ్రంథం. దానిపై నీ ఇష్టా ప్రవర్తన వారికి తీవ్ర బాధను కలిగిస్తుంది. మనది సహనశీల దేశం. అయినా ఖురాన్ దహనాన్ని సహించదు అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నాజీలు ఆర్యేతర మత సాహిత్య, చరిత్ర పుస్తకాలను కాల్చిన పక్షపాత ధోరణి ఖురాన్ ప్రతుల దగ్ధంలో కనిపిస్తుంది. నాజీలు కాల్చిన పుస్తకాలు, భవనాలు, తీసిన ప్రాణాలు యూదులవి. ఇస్లాం– ద్వేషంతో ఇస్లామేతరులు కాలుస్తున్న పుస్తకాలు వారివే. కూలుస్తున్న మసీదులు, చర్చిలు, కట్టడాలు దేశచారిత్రక సంపద. బైబిల్, గాంధీ, అంబేద్కర్ విగ్రహాల అపవిత్రం, సంఘ్ జాతీయ పతాకాన్ని అవమానించడం ఉన్మాదాలే. ఏ ప్రేరణతో చేసినా ఆక్షేపణలే. ఉదారవాద సమాజాలు అపచారాలను నేరమయం చెయ్యవు. ప్రతి ప్రత్యామ్నాయ చర్యా సంఘ్ మనోభావాలను ‘నొప్పించినట్లు’ ఇతరుల ప్రతి చర్యా కొందరి అవమానం. మత భక్తులకు సమాజ చర్యలు తమ నమ్మకాల, గ్రంథాల, మతచిహ్నాల భంగాలు. మతచర్యలు నాస్తికులకు అస్తవ్యస్తమే. ఒక జాతీయతకు మరొక జాతీయత నియమప్రవర్తనలు అగౌరవాలు. స్త్రీ పురుషులకు పరస్పర అసభ్యకర సంభాషణలు అభ్యంతరాలు. పురుషాధిపత్య హాస్యాలు స్త్రీల అవమానాలు. ఇవన్నీ సమాజంలో ఉదార రహిత, అసహన భాగాలు. విస్తృతంగా అనువర్తించే విద్వేష నియంత్రణ చట్టాలు హాస్యం, కళాత్మకత, సృజనాత్మకత, చర్చలేని ఆధిపత్యానికి దారితీస్తాయి. ద్వేషపూరిత, అవమాన ఉపన్యాసాల నియంత్రణ చట్టాలను కొందరి భావాలను నిరోధించడానికే ఉపయోగిస్తారు. ఐరోపా దేశాల్లోనూ ఇప్పుడు ముస్లిం వ్యతిరేక కార్యక్రమాలు పెరిగాయి. ఆ ప్రభుత్వాల ముస్లిం వ్యతిరేక మద్దతును పారదర్శక, ప్రజాస్వామ్య సమాజాలు సమర్థించవు. విద్వేష నియంత్రణ చట్టాలను మైనారిటీల, అణగదొక్కబడిన వర్గాల నోర్లు మూయించడానికి వాడిన ఉదంతాలు చరిత్రలో ఉన్నాయి. నియంత్రణ చట్టాల పక్షపాతంతో ద్వేషం, అసహనం తలెత్తుతాయి. బాధితులకే అన్యాయం జరుగుతుంది. పీడితుల ప్రశాంత నిరసనల నిరాకరణతో అశాంతి, హింస, అసాంఘిక చర్యలు పెరుగుతాయి. సామాజిక విభేదాల, సంఘర్షణల నిలుపుదలకు వాక్ స్వాతంత్ర్యం తప్పనిసరని పరిశోధనలు నివేదిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల, ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్ల యుగంలో పాలకవర్గ ఆధిపత్య నియంత్రణ, పాలితవర్గ పక్షపాతం, మత సామరస్యం అవసరం.

# పరిహారం వినియోగదారుని హక్కు!



వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. 1962, మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారు హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి15 తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 సంఘాలు, సంస్థలు 1973 మార్చి 15 ని వినియోగదారుల హక్కుల దినంగా పాటించాయి. భారత దేశంలో 1986లో వినియోగదారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగదారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాదకారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు.. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగ దారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసు కోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగ దారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగదారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగదారుల విద్య హక్కు... వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచు కోవడం, నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగదారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15 న జరుపుకుంటున్నాం. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ–కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీనివల్ల చోటుచేసుకుంటున్నాయి. వినియోగదారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగిపోతున్నది. దీంతో వినియోగదారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచంలోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగదా రుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగ దారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్ గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ– జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియ జేయాలి.

# బెల్లంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబరన్ని అంటిన హెూలీ సంబరాలు





**బెల్లంపల్లి,మార్చి 14 (సూర్యరేఖ)** హెూలీ పండుగ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంగరంగంగా వైభవంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొని ప్రజలతో కార్యకర్తలతో హెూలీ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ...బెల్లంపల్లి పట్టణ ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలు సంతోషంగా ఈ పండుగను జరుపుకోవాలని కోరారు. వారితో పాటు బెల్లంపల్లి టౌన్ యూత్ ప్రెసిడెంట్ సబ్బని అరుణ్,బెల్లంపల్లి టౌన్ మైనార్టీ ప్రెసిడెంట్ అలీ భాయ్,టౌన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ గోడిసెల మణి వార్డు ప్రెసిడెంట్లుమద్దెల గోపి,పైడిమల్ల చంద్ర శేఖర్, రాజాం, ధర్మేందర్ దాసరి సతీష్,బెడ్డల మహేందర్, సోము, సతీష్, మహేష్,సురేష్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెూలీ పండుగ సంబరాలు..





**నిజాంపేట,మార్చి14(సూర్యరేఖ)** మండల మండల వ్యాప్తంగా ఆయ గ్రామాలలో శుక్రవారం హెూలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ మేరకు మండల కేంద్రంలోని గ్రామ యువకులు హెూలీ పండుగ సంబరాలను ఘనంగా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హిందూ సాంప్రదాయాలలో రంగుల పండుగ ముఖ్యమని చిన్న పెద్ద తేడా లేకుండా లయబద్ధకంగా హెూలీ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నామన్నారు.ఈ కంప్యూటర్ కాలంలో పండుగలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం లేదని,ప్రతి ఒక్కరూ హిందూ సాంప్రదాయాల పండుగలను ఘనంగా జరుపుకోవాలని తెలిపారు.ఈ హెూలీ పండుగ కుల మతాలకు అతీతంగా జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. నిజాంపేట మండల ప్రజలందరికీ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి,గ్రామ యువకులు నవీన్ రెడ్డి,వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,జిట్టి మారుతి,పన్యాల వెంకటరెడ్డి,ప్రశాంత్ గౌడ్, రంజిత్ గౌడ్,బండారి ప్రశాంత్,నవీన్,ప్రదీప్ రెడ్డి,సామల మహేష్,చంద్రకాంత్ గౌడ్,బిక్షపతి,శ్రీకాంత్ గౌడ్, వేణు, వెంకట్,తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గడ్డం వినోద్







**బెల్లంపల్లి,మార్చి14 (సూర్యరేఖ)** హెూలీ పర్వదినం సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు,నాయకులకు, కార్యకర్తలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి హెూలీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రేమ ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా,శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే ఈ హెూలీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సహజ సిద్ధమైన రంగులతో సంప్రదాయ పద్ధతులతో ఈ రంగుల పండుగను ఆనందంతో సంతోషంగా జరుపుకోవాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆకాంక్షించారు.హెూలీ అనేది జీవితం, ప్రేమ రంగుల వేడుక. ప్రేమ,దయ,కరుణను వ్యాప్తి చేద్దాం ఈ ప్రపంచాన్ని మరింత అందమైన సామరస్యపూర్వక ప్రదేశంగా మారుద్దాం అని తెలిపారు.ఇతరులకు లేదా పర్యావరణానికి హాని కలిగించే ఏ చర్యలను నివారించి, పండుగను సురక్షితంగా బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజా రవాణాకు,వ్యాపార కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా హెూలీ వేడుకలను జరుపుకోవాలని బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ పిలుపునిచ్చారు.

# సత్యదేవుని కళ్యాణ మహెూత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు..

**ఉప్పల్,మార్చి 14 (సూర్యరేఖ)** రామంతపూర్ లోని ఇందిరానగర్ శ్రీ రామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సత్యదేవుని కళ్యాణ మహెూత్సవంలో రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు పాల్గొన్నారు.ఆలయ ఈవో భారతి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావును శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా,డివిజన్ ప్రధాన కార్యదర్శులు సంకూరి కుమారస్వామి, ఉలుగొండ నారాయణ దాస్, అంబటి భాగ్యలక్ష్మి, తాళ్ల మంగాగౌడ్, వీణ,శీలం సుధా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత..



**నిజాంపేట,మార్చి14(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ యాంకర్ జోర్దార్ బందారం సంతోష్ వివాహం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డికి వివాహానికి హాజరుకావాలని శుక్రవారం ఆహ్వాన పత్రిక అంద జేశారు.ఈ కార్యక్రమంలో జెల్లా దుబ్బరాజ గౌడ్,మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్,కేశల యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారితో చిన్నారులు హెూలీ సంబరాలు..



**నర్సింగ్,మార్చి14(సూర్యరేఖ)** మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం హెూలీ పండుగ పురస్కరించుకొని నార్సింగి చిన్నారులు రంగులతో చిందేస్తున్నారు.హ్యాపీ హ్యాపీగా హెూలీ సంబరాలు జరుపుకుంటున్నారు. డాన్సులు వేస్తూ కేరింతల కొడుతూ హెూలీ వేడుకలను జరుపుకుంటున్న చిన్నారులు పెద్ద వయసు వారి కంటే వేరే ఎక్కువ పండుగ వాతావరణం సంతోష సంబరాలతో నిండిపోయిన దృశ్యం కేంద్రంలో అగుపడుతుంది.సహజమైన రంగులు పూస్తూ పండుగ సంబరాలు జరుపుకున్నారు.

## శివాలయం పెద్దమ్మ తల్లి ఆలయంలో అభిషేక కార్యక్రమాలు..



**నిజాంపేట,మార్చి14(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని శివాలయం,పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం గ్రామ పురహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని మండల మాజీ జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హెూలీ పండుగను పురస్కరించుకొని గ్రామంలోని శివాలయం పెద్దమ్మ ఆలయాలలో అభిషేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.ఆ పరమేశ్వరుని పెద్దమ్మ తల్లి కృపతో నిజాంపేట గ్రామ ప్రజలందరూ అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి నాయకులు పాల్గొన్నారు.


## ఘనంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ కాప్రా బ్రాంచ్ వార్షికోత్సవ వేడుకలు..





**ఉప్పల్,మార్చి 14 (సూర్యరేఖ)** కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ కాప్రా బ్రాంచ్ లో అన్యువల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా సంగాని రాజు,అకాడమిక్ మేనేజర్ మురళి,జోనల్ మేనేజర్ జావేద్ అలీ,అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ...పిల్లలు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలని, విజయాలు సాధించాలని సూచించారు.కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కాప్రా బ్రాంచ్ లో టీచింగ్ స్టాఫ్ ప్రత్యేక సద్ధ తీసుకొని విద్యార్థులను తీర్చిదిద్దడంలో ముందున్నారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కాప్రా టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మమత,రవి,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నివాసంలో ఘనంగా హోలీ సంబరాలు




**నాయకులు జిహెచ్ఎంసి కార్మికులతో హోలీ సంబరాలు జరుపుకున్న కోదండరాం..**

**హైదరాబాద్,మార్చి14 (సూర్యరేఖ)** తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ నివాసంలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి.తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో పలువురు నాయకులు,జిహెచ్ఎంసి కార్మికులతో కలిసి కోదండరాం హోలీ సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..తెలంగాణ ప్రాంతంలో హోలీకి ఒక ప్రత్యేకత ఉందని,పిల్లలు పెద్దలు ఆనందోత్సవాల మధ్య ఈ వేడుకలు జరుపుకుంటారని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఆయన హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం. నరసయ్య ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి,ఎం.లక్ష్మణ్,అడిక్మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్,మహిళా జన సమితి నాయకురాలు పుష్పలత,తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందు లో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి




**ఉప్పల్,మార్చి14 (సూర్యరేఖ)** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మీర్పేట్ హేచ్ బి కాలనీ డివిజన్ డైమండ్ హిల్స్ కాలనీలోని 786 ఫంక్షన్ హాల్ లో ఇక్బాల్ ఇచ్చిన ఈఫ్తార్ విందు లో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ,సయిద్ ఇక్బాల్ ,అజీజ్,విట్టల్ నాయక్,ఎండీ. పర్వేజ్, ఎండీ. అష్రాఫ్, ఖాజా ముఖశార్ అలీ,అబ్దుల్ హమీద్,ఎండీ అమీన్ ఉద్దీన్, ఎండీ.హాబీద్ ఉద్దీన్,అమినోస్ భాయ్,అస్వాక్ భాయ్,పర్వేజ్ భాయ్, అంజయ్య,శ్రీనివాస్ ముదిరాజ్, గజెమిని, అలీం, మసూద్, జాఫర్,కరీం, మహేందర్,నవీన్ నరేందర్, రాజేష్ మల్లికార్జున్,సురేష్,శ్రీకాంత్ రెడ్డి,లింగం,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు


# ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఈసీఐఎల్ క్రాస్ రోడ్ లో ఉప్పల్ ఎమ్మెల్యే నిరసన ధర్నా




**ఉప్పల్,మార్చి 14 (సూర్యరేఖ)** బడ్జెట్ సమావేశాల సెషన్ నుంచి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. దానిలో భాగంగా శుక్రవారం ఈసీఐఎల్ చౌరస్తా వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు.పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. గవర్నర్ ప్రసంగంలోని అసత్యాలు, అర్ధసత్యాలను ఎత్తిచూపుతున్న జగదీష్ రెడ్డిని ప్రభుత్వం కుట్రపూరితంగానే సస్పెండ్ చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి,కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, మహిపాల్ రెడ్డి,నవీన్ గౌడ్, మహేష్ గౌడ్,బద్రుద్దీన్, సర్వబాబు యాదవ్, మనెమ్మ, భాస్కర్,అన్య బాల కృష్ణ,పల్లె నర్సింగ్ రావు,పిట్టల నరేష్ ,గుడి మధు సుదన్ రెడ్డి,జెల్లీ మోహన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# హోలీ రంగుల వలె ప్రజలు సంతోషంగా ఉండాలి

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**




**రాజేంద్రనగర్,మార్చి14** హోలీ రంగుల వలె ప్రజలందరి జీవితాలతో పలు రంగులతో వెల్లివిరిసి సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో హోలీ పండగ సంబరాల్లో భాగంగా డివిజన్లోని శానిటేషన్ బృందం ఎస్ఎఫ్ఐ,ఎంటమాలజీ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి వారికి రంగులు పూస్తూ హోలీ సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. నిత్యం మన కోసం కష్టపడే కార్మికులందరితో కలిసి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని,ప్రతి ఏడు ఇలా జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని,ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి కార్మికునికి,ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఊరంతా రంగులే..! రామాయంపేటలో హోలీ సందడి..



**రామాయంపేట,మార్చి 14 (సూర్యరేఖ)** రామయంపేటలో హోలీ పండుగ సందడి చేస్తోంది.. చిన్నారులు పెద్దలు అనే తారతమ్యం లేకుండా అందరూ హోలీ ఆడుతూ సంతోషంతో కేరింతలు తొక్కారు..తెల్లవారుజాము నుండి తాము హోలీ కోసం సిద్ధం చేసుకున్న రంగుల సామాగ్రితో స్నేహితులతో కలిసి రంగుల హరివిల్లు చేశారు. చిన్నారుల ఆనందానికి అవధులు లేవు..అన్ని పండుగలు లోపల హోలీ పండుగ ప్రత్యేకంగా ఉంటూ నూతన అనుభూతిని కలుగజేసింది..

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**హబ్సిగూడ విద్యుత్ శాఖ ఏఈ వి.గణేష్**




**ఉప్పల్,మార్చి 14 (సూర్యరేఖ)** శాఖపరమైన మరమ్మతులు,సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈనెల 15వ తేదీ శనివారం హబ్సిగూడ సెక్షన్ పరిధిలోని 11 కెవి స్నేహపురి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ హబ్సిగూడ ఏ.ఈ.వి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.మధ్యాహ్నం ఒకటిన్నర గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ సమయంలో స్నేహాపురి కాలనీ,శ్రీనగర్ కాలనీ, భవానినగర్ సీట్ నెంబర్ 3,4,5,వివిఎస్ టికాలనీ పార్ట్, హెచ్ డిఎఫ్ సి బ్యాంకు నుండి హెచ్ఎంటి కమాన్ వరకు,నాచారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పెద్దిరాజు పెద్దమ్మ మొదటి వార్షికోత్సవానికి ఆహ్వానం పత్రిక అందజేత..



**శివంపేట,మార్చి 14 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండలం అల్లీపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు బీసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి గంగాధర్ నీ మర్యాదపూర్వకంగా కలిశారు.జరగబోయే అమ్మవారి వార్షికోత్సవాలలో పాల్గొనవలసిందిగా ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అల్లిపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, గ్రామపెద్దలు,తదితరులు పాల్గొన్నారు..

## ప్రారంభమైన మాల పోచమ్మ పండగ ఉత్సవాలు..




**నిజాంపేట,మార్చి14 (సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మల్ల పోచమ్మ పండగ ఉత్సవాలు నేటి నుండి ప్రారంభమవుతున్నట్లు మలకుల సంఘ సభ్యులు తెలిపారు.మాల పోచమ్మ పండగ ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం దేవాలయం ఆవరణలో హోమగుండం కాల్చడం సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆదివారం అమ్మవారికి కళ్యాణం గావు పట్టుట,చివరి రోజు ఒగ్గు కథతో ముగింపు కార్యక్రమాలు ఉంటాయని కుల సంఘ పెద్దలు తెలిపారు.

# ఘనంగా హెూలీ వేడుకలు..





**రామాయంపేట,మార్చి14(సూర్యరేఖ)** రామాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో హెూలీ పండుగ ఘనంగా నిర్వహించారు.చిన్నారి మర్కు శ్రీనిధి తోపాటు వారి స్నేహితులు హెూలీ సంబరాల్లో మునిగితేలారు.చిన్న పెద్ద అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకొని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.హెూలీ అంటే అందరికీ సరదా అని పిల్లలనుంచి పండు ముసలి వరకు రంగులు చల్లుకుంటూ ఆలింగనం చేసుకుంటారు.మనసులో చెడును దహనం చేసేదే హెూలీ హెూలీ పండుగ జరుపుకోవడానికి తెలంగాణలో చాలా ప్రాంతాలలో హెూలీకి ఒకరోజు ముందు కూడలల్లో కట్టెలు పేర్చి కామదానం చేశారు.కామ దహనం చేసిన బూడిదను పెట్టుకొని తెల్లారి స్థానం మర్చటి ఆచారంగా ఉంది. పిల్లలు భయపడుతున్నట్టయితే కాముని బూడిది పెడతారు.ఇంకొక్క పురాణ కథ కూడా ఉంది హెూలీ రోజు శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి బృందావనంలో పువ్వులతో రంగుల ఉత్సవాన్ని జరుపుకునేందుకు భావిస్తారు.ఇలా రంగురంగు పూలు చల్లుకోవడం ద్వారా ప్రేమ సాభాగ్యుల వెల్లి ఇదుస్తాయని నమ్మకం కృత్రిమ యోగంలో రఘునాథుడు డాని సూర్యవంశ మహారాజు ఉండేవాడు.ఓ రోజంతా ప్రజలు వచ్చి పోలిక అనే రాక్షసి తమ తమ పిల్లల బాధిస్తుందని మొరపెట్టుకుంటారు.ఆ సమయంలో అక్కడ ఉన్న నారద మహర్షి ఎటు పౌర్ణమి రోజు ఓరికను పూజిస్తే బాధలు తొలగిపోతాయని తెలుపుతాడు.ఆ పూజలు పగటివేల చేస్తే కష్టాలు వస్తాయని రాత్రివేళ నిర్వహించాలని వివరిస్తాడు. ధోళిక అంటే ఉయ్యాలని అర్థం కూడా ఉంది మాసం పూర్ణం స్థితిలో బాలకృష్ణుని ఉయ్యాల వేసినట్టు పురాణాలు తెలుపుతున్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో హెూలీ రోజు కృష్ణుడు ప్రతిమను ఉయ్యాలలో వేసి డోలు కృత్వ జరుపుతారు. కృష్ణుడు కూడా రాదను ఊయాలో పెట్టి రంగులు పూస్తున్నట్లు చెబుతారు. హిందువులు వసంత కాలంలో వచ్చే పండుగను భారతదేశంలోనే కాకుండా నేపాల్ బంగాళా దేశ్ ప్రవసి భారతీయుల కూడా జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించినట్లు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..విద్యార్థుల సందడి

**అలరించిన చిన్నారుల డ్రామాలు,డాన్స్,వివిధ సంస్కృతిక కార్యక్రమాలు.**





**రాజేంద్రనగర్,మార్చి 14**రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధి మైలర్ దేవ్ పల్లి డివిజన్ దుర్గనగర్ లోని సేంట్ అంథోని గ్రూప్స్ నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు పాఠశాల కరస్పండెంట్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.సేంట్ అంథోని సిబిఎస్ సి పాఠశాల నర్సరీ నుంచి 5 క్లాస్ వరకు విద్యానభ్యసిస్తున్న విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్యం,మైకేల్ జాక్సన్ డాన్స్,తదితర నూత్యాలతోపాటు, గ్రేడ్యూహేషన్ విద్యార్థుల తల్లిదండ్రులను అమితంగా ఆకట్టుకున్నాయి.అలాగే సేంట్ అంథోని ఎస్ఎస్ సి విద్యార్థులు సైతం సైనికుల వేశాధారణ,పలురకాల నూత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కరస్పండెంట్ కిరణ్ సరథ్యంలో పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు సుమారు 25 రోజులుగా శ్రమించి విద్యార్థులకు నేర్పించారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



**చేగుంట,మార్చి14(సూర్య రేఖ)** చేగుంట మండలం కేంద్రంలో శుక్రవారం ప్రమాదవశాత్తు యువకుడు జారిపడి మృతి చెందాడు.చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు పులబోయిన శేఖర్(26) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 13 వ తేదీన సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు.కాగా శుక్రవారం శేఖర్ మృతుని శవము వడియారం గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద గాయాలతో పడి ఉందని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.మృతుడు ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి కింది పడడం వల్ల తలకు ముఖానికి ఇతర చోట్ల గాయాలు అయి మరణించినట్లుగా భావిస్తున్నారు.మృతుని అన్న పులబోయిన రవికుమార్ యొక్క ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మహిళ మిస్సింగ్ కేసు నమోదు



**నిజాంపేట,మార్చి14(సూర్యరేఖ)** మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామానికి చెందిన బాల మల్లవ్వ, వయస్సు (45) కుటుంబ సభ్యుల పండుగ విషయమై శంకరంపేట మండలం సూరారం బాగిర్తిపల్లె వారి బంధువుల ఇంటికి వెళ్లిన ఆమె తప్పిపోవడంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఆమె ఆచూకీ కొరకు 8498951189, 8008808539,9133692067, నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.ఆచూకీ తెలిపిన వారికి పారితోషకం అందిస్తామన్నారు.

## వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా హెూలీ వేడుకలు



**మంచిర్యాల, మార్చి 14(సూర్య రేఖ)** మంచిర్యాల వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు రంగులకేళి హెూలీ వేడుకల్లో మునిగితేలారు. శుక్రవారం కళాశాలలో సహజ సిద్ధమైన రంగులతో చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనంద తాండవం చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అధ్యాపకులు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని రంగులతో సందడి చేశారు. దీంతో కళాశాల ప్రాంగణమంతా రంగుల కలగా మారింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రేమ, స్నేహం, సామరస్యానికి ప్రతీక హెూలీ పండుగ అని అన్నారు. ప్రమాదకరమైన రసాయనాలతో కాకుండా సహజ రంగులతో ఈ వేడుకలు నిర్వహించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్, కలశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెూలీ సంబరాలు..





**శివంపేట,మార్చి 14 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రంలో హెూలీ పండుగ రోజున గ్రామ ప్రజలందరూ కలిసి హెూలీ సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాజా భజంత్రీలతో గ్రామ ప్రజలందరికీ కలుపుకొని అందరిపై రంగులు జల్లుతూ ఆనంద్ ఉత్సాహాలతో హెూలీ సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పిమిజి యువసేన సభ్యులు గ్రామ ప్రజలు పిల్లలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని పోలి పండుగను సంతోషాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం హెూలీ సంబరాలు కుల,మత బేధాలు లేకుండా అందరూ జరుపుకుంటాము, అందులో భాగంగా ఈరోజు కూడా హెూలీ పండుగ అందరిని కలుపుకొని అందరి సంతోషంతో చాలా బాగా జరుపుకున్నామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## భవానికాలనీలో హెూరెత్తిన హెూలీ సంబరాలు..



**బండ్లగూడ,మార్చి 14** బండ్లగూడ జగీర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులోని భవానికాలనీలో హెూలీ వేడుకలు అంబరాన్ని అంటాయి.రంగుల పండుగకు కాలనీ వాసులు పెద్ద ఎత్తున హాజరై,చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులతో పరస్పరం మునిగిపోయారు. హెూలీకి ముందు రోజు హెూలీ కామదహనాన్ని ఘనంగా నిర్వహించి, దుష్టశక్తుల వినాశనానికి నిదర్శనంగా ప్రదక్షిణలు చేశారు.ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు,డిజే మ్యూజిక్,పాటలు, నృత్యాలతో కాలనీ మొత్తం ఉత్సాహభరితంగా మారింది.పిల్లలకు,మహిళలకు ప్రత్యేకంగా ఆటపాటలు,ఫోటో సెషన్ నిర్వహించారు. నిర్వాహకులు అర్జున్,శ్రీనివాస్,జనరల్ సెక్రెటరీ వెంకటేష్,విజయ్ హెూలీ స్పెషల్ వంటకాలు సిద్ధం చేసి,అందరికీ విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ అశోక్ మాట్లాడుతూ... "భవానికాలనీలో హెూలీ వేడుకలను ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ పండుగ ద్వారా అందరిలో ఐక్యత, అనురాగాన్ని పెంపొందించుకోవడం మా లక్ష్యం" అని పేర్కొన్నారు. హెూలీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన అర్జున్ వారి బృందానికి అసోసియేషన్ సభ్యులు అధ్యక్షులు అశోక్,జనరల్ సెక్రెటరీ వెంకటేష్,ట్రెజరర్ నాగేశ్వర్ రెడ్డి,ఇతర సభ్యులు తిరుపతి రెడ్డి,చక్రధర్ రెడ్డి, ప్రేమ్ కుమార్,రాజ్ కుమార్,కిరణ్ బుద్దే కృతజ్ఞతలు తెలిపారు.

## బెల్లంపల్లి గ్రౌండ్ హెూలీ పండుగను ఘనంగా నిర్వహించిన వాకర్ అసోసియేషన్ సభ్యులు

**ముఖ్య అథిగా పాల్గొన్న టీపీసీసీ ప్రచార జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి**





**బెల్లంపల్లి,మార్చి14(సూర్యరేఖ)** హెూలీ పండుగ సందర్భంగా బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ లో తిలక్ వాకర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి,బెల్లంపల్లి ప్రముఖ వ్యాపారస్తులు కోడిపాక శ్రీనివాస్ దత్తాత్రేయ ట్రేడర్స్,డిపిపిఎస్ యజమాని పురుషోత్తం సార్డ,వివిధ రంగాల ముఖ్య వ్యాపారవేత్తలు వాకర్ అసోసియేషన్ సభ్యులు అందరూ తిలక్ మైదానంలో హెూలీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా తిలక్ వాకర్ అసోసియేషన్ వారు వేడుకల్లో పాల్గొన్న వారందరికీ ఉదయపు ఆల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది.పిల్లలు పెద్దలు అందరూ కలిసి అంగరంగ వైభవంగా వేడుకలు రంగులతో జరుపుకున్నారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు, వ్యాపారవేత్తలకు, మీడియా మిత్రులకు, ప్రభుత్వ అధికారులకు, పోలీస్ సిబ్బందికి,అన్ని రంగాల వారికి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# రాజేంద్రనగర్ లో ఘనంగా హోలీ వేడుకలు..!





**అంబరాన్నంటిన హోలీ సంబరాలు..**

**రాజేంద్రనగర్,మార్చి 14** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి.శుక్రవారం తెల్లవారుజాము నుంచే పట్టణ వీధుల్లో యువత భారీగా బయటకు వచ్చి హోలీ సంబరాలు చేసుకున్నారు.చిన్నా,పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు నృత్యాలు చేశారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.పలు ప్రాంతాలలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు.ఇక చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బస్తీలు, కాలనీలలో మహిళలు పెద్ద ఎత్తున హోలీ వేడుకలు జరుపుకొని సంతోషం వ్యక్తం చేశారు. యువకులు డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకలు నిర్వహించారు. స్నేహితులు,కుటుంబ సభ్యులతో రంగుల హరివిల్లుల్లో ఆటలతో ఘనంగా జరుపుకున్నారు. చాలా మంది ఒకరికొకరు రంగులు వేసుకుని సెల్ఫీలు దిగి ఆనంద వ్యక్తం చేశారు.ప్రజలు రంగులు జల్లుకొని ఆనందగా వేడుకలను ఆస్వాదించారు.హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. రాజేంద్రనగర్ లో పోలీసులు హోలీ సంబరాలలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండ ముందస్తు చర్యలు చేపట్టారు.ఈ ానసందర్భంగా వివిధ పార్టీల నాయకులు ప్రజలందరికి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.చిన్నా,పెద్ద తేడా లేకుండా ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ హోలీ అని ఎమ్మెల్యే అన్నారు.రంగుల పండుగ హోలీ,మీ అందరీ జీవితాలను రంగులతో నింపాలన్నారు.ఈ హోలీ నాడు మీ కష్టాలన్నీ తొలగించాలని,మీ జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శీలం తిరుపతిరెడ్డి సరికొండ వెంకటేష్,సూరెడ్డి సాయి రెడ్డి,సూరెడ్డి కరుణాకర్ రెడ్డి,ఔరది రమేష్,కిషోర్ కుమార్,సూరెడ్డి జగన్మోహన్ రెడ్డి,పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,అజయ్ కుమార్, ఎనుముల ధనంజయ రెడ్డి,సూరెడ్డి సాయి కృష్ణారెడ్డి,దేవేందర్ రెడ్డి,అమ్రేష్,మెక్కొండ ప్రేమ్ రాజ్,తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ లో ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలు..





**రాజేంద్రనగర్,మార్చి 14** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆనందోత్సాహాలతో హోలీ సంబురాలు జరిగాయి. పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఆనందోత్సాహాలతో రంగులపండుగ చేసుకున్నారు.రాజేంద్రనగర్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో మహిళలు ఒకరికొకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.డీజే పాటలు పెట్టుకుని నృత్యాలు చేశారు.పిల్లలు శుక్రవారం తెల్లవారడమే ఆలస్యం హోలీ సంబరాలు మొదలుపెట్టారు.గుంపుగుంపులుగా గల్లీగల్లీ తిరుగుతూ స్నేహితులపై రంగులు చల్లుకుంటూ, ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకుంటూ సందడి చేశారు.పిల్లల ఆటలతో,కేరింతలతో గల్లీల్లో పండుగ కళ ఉట్టిపడింది. మహిళలు,పిల్లలతోపాటు కాలనీకి చెందిన యువకులు, పెద్దలు,మహిళలు హోలీ ఉత్సవాల్లో మునిగితేలారు. ఉదయం నుంచే ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆనందంలో మునిగితేలారు.డీజే పాటలు పెట్టుకుని జోరుగా డ్యాన్సులు వేశారు.

# టాటా టియాగో లవర్స్‌కు గుడ్‌న్యూస్..

# నయా వెర్షన్‌లో అదిరే ఫీచర్స్




భారత ఆటోమొబైల్ రంగంలో అప్‌డేట్స్ ఫీవర్ నడస్తుంది. చాలా కంపెనీలు మార్చి నుంచి తమ మోడల్స్ కార్లు, బైక్‌లను 2025 వెర్షన్‌ను అప్‌డేట్ చేసి రిలీజ్ చేస్తున్నాయి. ఇదే బాటలో టాటా కంపెనీ కూడా తన టియాగో కారును ఎన్ఆర్‌జీ పేరుతో అప్‌డేట్ చేసింది. సరికొత్త ఫీచర్స్‌తో పాటు ఆకర్షణీయ రంగుల్లో ఈ కారు అందుబాటులో ఉంది. టాటా టియాగో ఎన్ఆర్‌జీ కారును కొత్త ఫీచర్లు, స్టైలింగ్ అప్‌డేట్స్, కొత్త ట్రాన్స్ మిషన్ ఎంపికను తీసుకువచ్చింది. 2025 టాటా టియాగో ఆన్ఆర్‌జీ ధర ఇప్పుడు రూ.7.2 లక్షల నుంచి రూ.8.75 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంది. ఈ కారు టాప్-స్పెక్ ఎక్స్‌జెడ్ ట్రిమ్ మాత్రమే అందుబాటులో ఉంది. ఎంట్రీ- లెవల్ ఎక్స్‌టీ ట్రిమ్ 2025 టియాగో వెర్షన్‌లో అందుబాటులో ఉండదు. కొత్త టియాగో ఎన్ఆర్‌జీ పెద్ద ఇన్ఫోటైన్మెంట్ స్క్రీన్‌తో ఆకర్షణీయ సీఎన్‌జీ-ఏఎంటీ ఎంపికతో వస్తుంది. 2025 టాటా టియాగో ఎన్ఆర్‌జీ నూతన స్టైలింగ్ అప్‌డేట్స్‌తో వస్తుంది. కొత్త మ్యాట్ బ్లాక్ క్లాడింగ్‌తో పునఃరూపకల్పన చేసిన బంపర్, ముందు, వెనుక భాగంలో మందమైన సిల్వర్ స్కిడ్ ప్లేట్ ఉన్నాయి. 15 అంగుళాల స్టీల్ వీల్స్ వేర్వేరు కవర్లతో వస్తున్నాయి. టాటా టియాగో ఎన్ఆర్‌జీ మరింత దృఢంగా కనిపించేలా నల్లటి క్లాడింగ్‌తో వస్తుంది.

టాటా టియాగో ఎన్ఆర్‌జీ క్యాబిన్ విషయానికి వస్తే వైర్లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లేతో కూడిన పెద్ద 10.25 అంగుళాల ఇన్ఫోటైన్మెంట్ యూనిట్ ఆకట్టుకుంటుంది. అలాగే రివర్స్ కెమెరా, ఆటో హెడ్ల్యాంప్, వైపర్లు, డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ కన్సోల్ వంటివి అదనపు ఆకర్షణగా నిలుస్తాయి. స్టాండర్డ్ టియాగోతో పోలిస్తే టియాగో ఎన్ఆర్‌జీ సీట్లు, డోర్ ప్యాడ్లు, డాష్‌బోర్డ్‌తో సహా పూర్తిగా బ్లాక్ క్యాబిన్‌తో వస్తుంది. ఆకర్షణీయ టాటా లోగోతో టూ-స్పోక్ స్టీరింగ్ వీల్ ఆకట్టుకుంటుంది. టాటా టియాగో ఎన్ఆర్‌జీకి 5 స్పీడ్ మాన్యువల్, ఏఎంటీ యూనిట్‌తో జత చేసిన 84.8 బీహెచ్‌పీ 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజన్ శక్తినిస్తుంది. సీఎన్‌జీ వెర్షన్ 71 బీహెచ్‌పీను ఉత్పత్తి చేయడానికి డిట్యూన్ చేశారు. 5 స్పీడ్ మాన్యువల్, ఏఎంటీ యూనిట్‌తో జత చేసి వస్తుంది. సీఎన్‌జీ-ఏఎంటీ మోడల్స్‌లో పూర్తిగా కొత్త ఎంపికగా ఉంటుంది. గత సంవత్సరం టియాగో సీఎన్‌జీలో ప్రవేశ పెట్టారు. అప్‌డేటెడ్ టాటా టియాగో ఎన్ఆర్‌జీ మారుతి సుజుకి స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి కార్లకు గట్టి పోటీనిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# ఆకర్షిస్తున్న స్ప్లెండర్ ప్లస్ నయా వెర్షన్

భారతదేశంలో మధ్యతరగతి ప్రజలు సౌకర్యవంతమైన బైక్ అంటే స్ప్లెండర్ ప్లస్ అని టక్కున చెబుతున్నారు. మొదట్లో హీరో-హోండా బ్రాండ్ ద్వారా అందుబాటులో ఈ బైక్‌ను అనంతర పరిస్థితుల్లో హీరో కంపెనీ రిలీజ్ చేస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు సూపర్ ఫీచర్స్‌తో ఈ బైక్‌ను అప్‌డేట్ చేస్తున్నారు. అయితే తాజాగా ఈ బైక్ 2025 వెర్షన్‌ను కంపెనీ ప్రకటించింది. హీరో మోటోకార్ప్ తన బెస్ట్ సెల్లింగ్ మోటార్ సైకిల్ స్ప్లెండర్ ప్లస్‌ను అదిరే ఫీచర్స్‌తో అప్‌డేట్ చేసింది. 2025 హీరో సెండర్ ప్లస్ ఇటీవల హీరో డీలర్ల వద్దకు చేరింది. ముఖ్యంగా ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌తో ఈ బైక్‌ను అప్‌గ్రేడ్ చేశారు. అలాగే ఈ బైక్‌లో కొత్త కలర్ ఆప్షన్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. 2025 హీరో సెండర్ ప్లస్ ప్రస్తుత మోడల్ మాదిరిగానే డిజైన్ ఉంది. అయితే ఫీచర్స్‌పరంగా కొన్ని ప్రధాన మార్పులు ఉన్నాయి. 2025 సెండర్ ప్లస్ స్ప్రెషాట్ కనీసం మరో రెండు కొత్త కలర్ ఆప్షన్లతో వస్తుంది. గోల్డ్ డెకల్‌తో కూడిన ఎరుపు రంగులో ఉంటే మరొకటి బూడిద రంగులో ఉంటుంది. ఈ కొత్త కలర్ స్కీమ్స్‌తో పాటు కొత్త సెండర్ ప్లస్ అప్‌డేటెడ్ బాడీ గ్రాఫిక్స్ కూడా వస్తుందని భావిస్తున్నారు.2025 హీరో సెండర్ ప్లస్ హార్డ్ వేర్ అప్ గ్రేడ్ల విషయానికి వస్తే ఫ్రంట్ డిస్క్ బ్రేక్ ఒక పెద్ద మార్పుగా ఉంటుంది. కొత్త హీరో సెండర్ ప్లస్‌ను ఫ్రంట్ డిస్క్ బ్రేక్ హీరో స్ప్రెండర్ ప్లస్ ఎక్స్ క్లో అందుబాటులో ఉంటుంది. అలాగే డిజిటల్ స్క్రీన్‌తో వచ్చే ఆధునిక వెర్షన్‌లా ఉంటుంది. డిస్క్ బ్రేక్ ఇప్పటికే ఉన్న డ్రమ్ బ్రేక్ సెటప్‌తో పోలిస్తే మెరుగైన బ్రేకింగ్ పవర్‌తో మోటార్ సైకిల్‌కు సంబంధించిన భద్రతా గుణాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. అయితే ఈ బైక్ వెనుక టైర్ డ్రమ్ బ్రేక్ సెటప్‌తో వస్తుంది. పవర్ ట్రెయిన్ విషయానికి వస్తే ముందు భాగంలో మోటార్ సైకిల్ 97.2 సీసీ ఎయిర్-కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ప్రస్తుత మోడల్స్ 7.91 బీహెచ్‌పీ పీక్ పవర్, 8.05 ఎన్ఎం గరిష్ట టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 2025 హీరో సెండర్ ప్లస్ స్పెసిఫికేషన్లు పెద్దగా మారకుండా ఉంటాయని భావిస్తున్నప్పటికీ ఇంజిన్ ఓబీడీ-2బీ నార్మ్ కంప్లైయన్స్‌తో అప్‌డేట్ ఉంటుంది. ట్రాన్స్



మిషన్ డ్యూటీ కోసం మోటార్ సైకిల్ నాలుగు-స్పీడ్ గేర్ బాక్స్‌తో ఆకట్టుకుంటుంది. కొత్త సెండర్ ప్లస్ ఎప్పుడు విడుదల అవుతుందో? హీరో మోటోకార్ప్ ఇంకా వెల్లడించ లేదు. హీరో సెండర్ ప్లస్ ప్రస్తుత ధర రూ.77,176 రూ.79,926 (ఎక్స్-షోరూమ్) వద్ద అందుబాటులో ఉంటే, కొత్త సెండర్ ప్లస్ కొంచెం ఎక్కువ ధరకు వస్తుందని అంచనా వేస్తున్నారు.

## ఫెవికాల్ ఛాంపియన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ సంబరాలు



**ఉప్పల్,మార్చి14(సూర్య రేఖ):** హోలీ పండుగ సందర్భంగా ఫెవికాల్ చాంపియన్ క్లబ్ అధ్యక్షుడు చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో వెంకట్ రెడ్డి నగర్ లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.క్లబ్ అధ్యక్షుడు ఎల్లాచారి మాట్లాడుతూ..హోలీ రోజున ఒకరు మీద ఒకరు చల్లుకునేది రంగులు కావు అని అనురాగాలు ఆప్యాయతలు కలిసిన పన్నిటి రంగుల జల్లులని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పూసల కనకచారి,విశ్వనాధుల రామకృష్ణ,కేతోజు రాఘవులు,బ్రహ్మచారి ,శంకర్,నరేందర్ రాజు,అరవింద్,ఫెవికాల్ ప్రతినిధులు ఫిరోజ్,మహేష్ తదితరులు పాల్గొన్నారు

## అల్లిపూర్ లో పెద్దిరాజు పెద్దమ్మ జాతర ఉత్సవాలకు ఆహ్వానం



**శివంపేట,మార్చి14(సూర్య రేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండలంలోని అల్లిపురం గ్రామంలో పెద్దమ్మ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు పలువురు నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.అదేవిధంగా శివంపేట మండల కేంద్రంలో చెందిన మెదక్ జిల్లా మాజీ జెడ్పి కోఆప్షన్ మెంబర్ సభ్యులు మన్సూర్ కు ఆహ్వాన పత్రికను పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవ నిర్వహణ కమిటీ తరపున అందజేశారు.

## ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు



**మందమర్రి,మార్చి14(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా మందమర్రి ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం స్థానిక ఫోటోభవన్ లో చిన్న,పెద్ద అనే తేడా లేకుండా ప్రేమానురాగాలతో తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ది సిటిజన్స్ కౌన్సిల్ సంస్థ సమావేశం..

**మణికొండ,మార్చి14** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మై హెూం అవతార్, హాల్ మార్క్ విసినియా ప్రాంగణాలకు అతి సమీపంలో ఉన్న రెడీమిక్స్ ప్లాంటును మూసివేయాలని రెండు రోజులు క్రితం హైకోర్టు వారు ఇచ్చిన ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని అక్కడ స్థానికులతో ది సిటిజన్స్ కౌన్సిల్ సంస్థ 15 మార్చి 2025 ఉదయం వేళలో సమావేశం ఉందని తెలిపారు.అనంతరం 12 గంటలకు డాలర్ హిల్స్ లో ఉంది.సిటిజన్స్ కౌన్సిల్ ఆఫీసులో చిన్నపాటి పత్రికా సమావేశం ఉందని, కావున ఈ సమావేశానికి తప్పకుండా రావాలని పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ పై బీఆర్ఎస్ నాయకుల నిరసన..



**రామకృష్ణాపూర్,మార్చి14(సూర్యరేఖ)** అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ పై నిరసన వ్యక్తం చేస్తూ రామకృష్ణాపూర్ పట్టణంలోని స్థానిక రాజీవ్ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ...ప్రస్తుతం ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు.గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు పరచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు.అసెంబ్లీ స్పీకర్ కి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని,ప్రజల సమస్యలను అసెంబ్లీలో గళం వినిపిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డినీ సస్పెన్షన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు మొదలైందని,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా చూపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్,బడికల సంపత్, రామిడీ కుమార్,పోగుల మల్లయ్య,రేవెల్లి ఓదేలు, ఆలుగుల సత్తయ్య,యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు శివరాంపల్లి,కాటేదాన్,కిస్మత్పూర్,హిమాయత్ సాగర్, ఇబ్రహీంబాగ్ లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం



**బండ్లగూడ/మణికొండ/రాజేంద్రనగర్,మార్చి14** శివరాంపల్లి, కాటేదాన్,కిస్మత్ పూర్,హిమాయత్ సాగర్, ఇబ్రహీంబాగ్ (మణికొండ) విద్యుత్ సెక్షన్ల పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయా సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్లు తెలిపారు.

**కిస్మత్ పూర్ లో..**

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుండి 3:30 వరకు శ్రీసాయికాలనీ,ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్రకాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్,రాధా రియాలిటీ, వివేకానందకాలనీ, యాదాద్రికాలనీ,ఓంనగర్ కాలనీ,ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్,పూజా విల్లాస్,రాక్ చర్చ్,కృతి విల్లాస్, కిస్మత్పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి 2:30 వరకు కిస్మత్పూర్ విలేజ్, రాఘవేంద్ర కాలనీ,శివ సాయికాలనీ,బాబమ్మ కాలనీ, మైత్రికాలనీ, వినాయకనగర్, మారుతీకాలనీ,ఎస్సీ బస్తి, శ్రీకృష్ణకాలనీ,విల్లా గ్రీన్,ఆద్యవిలాస్, గిరిదారి అపార్ట్మెంట్, ఓఎన్ వై ఎక్స్ విల్లాస్,గృహ శిల్పి, హనుమాన్ టెంపుల్, డాన్ బెస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుండి 2 గంటల వరకు మిచల్ కాలనీ, వినాయక్ నగర్,డీడీ కాలనీ,కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్,ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యానగర్,జిఆర్ నగర్,మచ న్పల్లి ఎంక్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజు తెలిపారు.

**హిమాయత్ సాగర్ సెక్షన్ లో..**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పిఅండ్ టీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పిఅండ్ టి కాలనీ,వై జంక్షన్,ఏబిసి బ్లాక్,కితి రిచ్మండ్ విల్లాస్,అయ్యర్ ఎంక్లేవ్,పోచమ్మ టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.అమర్ సింగ్ తెలిపారు.

**ఇబ్రహీంబాగ్ సెక్షన్ లో..**

ఇబ్రహీంబాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సంతోష్ కుమార్ తెలిపారు.పీజీ కాలేజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 1,2, సెక్టర్ టు ఏబిసి, ఆదిత్య పోర్టు విల్లాస్,శివాలయం,లాంకో విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 4 గంటల వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 3 నుండి 13 వరకు,పుప్పాలగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పుప్పాల్ గూడ విలేజ్, మారుతినగర్,దుర్గానగర్,రాఘవేంద్రకాలనీ,గోల్డెన్ ఓరియన్, మానస అపార్ట్మెంట్,ఎల్ఐసికాలనీ, అల్కాపూర్ రోడ్ నెంబర్ 8 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**కాటేదాన్ లో...**

కాటేదాన్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2:30 నుండి 3 గంటల వరకు దుర్గా నగర్ విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన దుర్గా నగర్,దుర్గాహిల్స్,టీఎన్జీవోస్ కాలనీ అయ్యప్ప స్వామి టెంపుల్,మైలార్దేవ్పల్లి కల్లు కాంపౌండ్, శాంతినగర్,గణేష్ నగర్,స్వప్న టాకీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కాటేదాన్ విద్యుత్ ఫీడర్ రెండు పరిధిలో గల ప్రాంతాలైన విశ్వకర్మ ఇంజనీరింగ్,బ్యాటరీ కంపెనీ, బసప్ప హోటల్ లేన్,హనుమాన్ టెంపుల్ ప్రాంతం, మినార్ హోటల్ ప్రాంతం,స్వప్న థియేటర్ ప్రాంతంలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**శివరాంపల్లిలో..**

శివరాంపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 నుండి 2:30 వరకు యూనివర్సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ,సిటీ బెస్ట్ ప్రైస్, కాందారిహిల్స్,శ్రీదేవి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# సర్కారీ స్కూళ్లలో ఏఐ



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 15 నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏ.ఐ ను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ ఈ విషయమై జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో ప్రకటించారు. పాఠశాల విద్యార్థుల పరిజ్ఞానం, నైపుణ్యం పెరిగేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరిలో సర్కార్ బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు గతంలో పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాలో ప్రారంభించారు. వాటిలో..మెదక్ జిల్లాలో బూర్గుపల్లి, మాసాయిపేట , నిజాంపేట,తూప్రాన్, కాళ్లకల్, నర్సాపూర్, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్స్ ఎంపికయ్యాయి. భద్రాద్రి జిల్లాలో హన్మాన్బస్తీ, కేటీపీఎస్ కాలనీ, వికలాంగుల కాలనీ, తాతగుడిసెంటర్, పాలకొయ్య తండా, ఓల్డ్ కొత్తగూడెం ప్రైమరీ స్కూల్, ఖమ్మం జిల్లాలో ఎన్ ఎస్ సీ ఖమ్మం, మల్లెమడుగు, పాండురంగాపురం, సత్తుపల్లి, సింగారెడ్డిపాలెం, రాజేంద్రనగర్ ప్రైమరీ స్కూల్స్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జనతానగర్, కొంపల్లి, ప్రగతి నగర్, మల్లాపూర్, ఎల్లమ్మ బండ, బహదూర్పల్లి, నారాయణ పేట్జిల్లాలో గూడె బెల్లూర్, ముడుమల్, కొల్లంపల్లె, దామరగిద్ద, కర్ని, శివాజీ నగర్, వికారాబాద్ జిల్లాలో ఓల్గాండూరు(తెలుగు మీడియం), దౌల్తాబాద్, కొట్బాస్పల్లి, రేగడ్మేల్వేర్, మల్కాపూర్గని, తాండూర్(ఉర్దూ మీడియం) స్కూళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అందించే ప్రోగ్రామ్ అమలైంది.అది మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి జిల్లాలో కొన్ని ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడం జరిగింది. ఆయా జిల్లాల్లో ముందస్తుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ఏ.ఐ వినియోగిస్తూ సులభతరంగా విద్యా బోధన చేయాలని నిర్ణయించారు. ఏ.ఐ. కోర్సు ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా ప్రతి పాఠశాలలో ఐదు కంప్యూటర్లు, అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్, హెడ్ ఫోన్స్ ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. జిల్లాలో ముందుగా ఎంపిక చేసిన పాఠశాలలో ఏ ఏ కోర్సు ద్వారా విద్య బోధన జరుగుతుందని, ఇక్కడ వచ్చే ఫలితాలను అంచనా వేస్తూ భవిష్యత్తులో దీన్ని మరింత విస్తరించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఇక ఏఐ ద్వారా విద్యార్థి సామర్థ్యం పెంపొందించే విషయంలో ఏఐ ముఖ్య భూమిక పోషించనుంది. వారి సామర్థ్యం మెరుగుపరిచే విధానంలో ఏఐ ఎంతగానో ఉపయోగపడనుంది.

# దళితుడు కాబట్టి ఆ విధంగా వ్యవహరించారు.

**హైదరాబాద్ :** చట్టసభల్లో ప్రజాస్వామ్యానికి సభకు నాయకుడు ముఖ్యమంత్రి. సభకు అధిపతి స్పీకర్. అటువంటి స్పీకర్ ని పట్టుకొని సభ మీ ఒక్కడిది కాదు అని మాట్లాడడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. స్పీకర్ మీకు మళ్ళీ అవకాశం ఇచ్చి పొరపాటు అంటుంటే అవును మీది కాదు అని మాట్లాడుతూ కనీసం నన్ను సంప్రదించలేదు చెప్పుకోవడానికి అవకాశం కూడా ఇవ్వలేదు మాట్లాడుతున్నారు. ఇవన్నీ గమనిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వం కూడా జగదీశ్వర్ రెడ్డి చేసింది తప్పు స్పీకర్ ని సభలో ఇలా మాట్లాడడం మంచిది కాదని చెప్పడం లేదని అన్నారు. దానికి నిన్న ధర్నాలు చేయడం నియోజకవర్గాల్లో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్ళే ఈరోజు నిరసనలు తెలుపుతున్నారు. ఇది హాస్యాస్పదం ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి కనీసం జ్ఞానం రావాలి. సభలో ఏవిధంగా ఉండాలి సభ వేదిక పై ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా ఇలా చేస్తున్నారంటే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నారు. ఇది ప్రజలు గమనించాలి. సభకు కొన్ని సంప్రదాయాలు పద్ధతులు ఉంటాయని అన్నారు. ఉదాహరణకు అబద్ధం అనడానికి కూడా విలువ లేదు సత్యదూరం అనాలి. శాసన సభలో కొన్ని అంశాలు ఉన్నప్పుడు సభ మీ ఒక్కడిదా అంటే ఆయన శాసన సభకు అధిపతి అందులోనె అర్థం ఉంది. దళితుడు కాబట్టి ఆ విధంగా వ్యవహరించారని మాట్లాడుతున్నారు. ఇదే బీఆర్ఎస్ గతంలో శాసన మండలి చైర్మన్ మీద కాగితాలు పడేసారని ఇద్దరు సభ్యులను తొలగించారు భర్తరఫ్ చేశారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మర్చిపోయారా..? ఇటువంటి మాటలు వద్దు ఇటువంటి నిరసనలు ఎతీబ కి



మంచిది కాదని అన్నారు.

## గణేష్ నగర్ కాలనీలో హెూలీ పండుగలో పాల్గొన్న శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బీసోళ్ళ శ్రీధర్



**శంకర్పల్లి,మార్చి14(సూర్యరేఖ)** శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ కాలనీలో హెూలీ సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బిసోళ్ళ శ్రీధర్ పాల్గొన్నారు.మాజీ సర్పంచ్ పిల్లలకు,యువకులకు రంగులు చల్లి హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారందరితో కలిసి చిందులు వేశారు అంతా సందడి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో గుండప్ప ప్రవీణ్,రాకేష్, లడ్డు,చిన్న, ప్రవీణ్,సాయి,రఘు,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు ఇచ్చి మజీద్ సదర్ లకు సన్మానం చేసిన సింగితం మైనార్టీ యువకులు



**ఆందోల్,మార్చి14(సూర్య రేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడు మండలం సింగితం గ్రామంలో మైనార్టీ యువకులంతా కలిసి మెలసి భారీ ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగింది.అలాగే మజీద్ సదర్ సాబ్ మొహమ్మద్ సుల్తాన్,నాయబ్ సదర్ సయ్యద్ కాజ మియా,తాజా మాజీ సదర్ మారుఫలి,తాజా మాజీ నాయబ్ సదర్ సాజిద్ మియా, వీరందరికీ మైనార్టీ యువకులు ఘనంగా సన్మానించి ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ యువకులు ముఖిమ్, ముజీబ్, ఇర్ఫాన్, అమీర్, ఫెరోజ్, సల్మాన్, ఆరీఫ్,హైమద్,మదర్,అతిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా కోలుకోని శ్రీ తేజ

**హైదరాబాద్ :** ఒక్కోసారి రికార్డ్ బ్రేకింగ్ హిట్ వచ్చినా కూడా ఎంజాయ్ చేసే అదృష్టం కూడా ఉండాలి..! ఈ విషయంలో అల్లు అర్జున్ మోస్ట్ అన్ లక్కీ. మొన్నొచ్చిన పుష్ప 2 సినిమా దేశమంతా దున్నేసినా.. 1800 కోట్లు వసూలు చేసినా.. మనస్ఫూర్తిగా ఈ సినిమా సక్సెస్ ఎంజాయ్ చేయలేకపోయాడు అల్లు వారబ్బాయి. దీనికి కారణం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సంధ్య థియేటర్ దగ్గర డిసెంబర్ 4 రాత్రి పుష్ప 2 సినిమా ప్రీమియర్స్ సందర్భంగా జరిగిన ఓ సంఘటన మొత్తం సినిమా యూనిట్‌కు శాపంగా మారింది. ఒక్క ఇన్సిడెంట్‌తో వాళ్ల సినిమా సక్సెస్ అంతా గాల్లో కొట్టుకుపోయింది. అంత పెద్ద హిట్ అయినా ఎంజాయ్ చేయలేని పరిస్థితుల్లో పడిపోయారు బన్నీ అండ్ బ్యాచ్. ఆ దుర్ఘటనలో రేవతి అనే మహిళ చనిపోయింది.. ఆమె కొడుకు శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అప్పట్నుంచి ఆ కుర్రాడు హాస్పిటల్‌లోనే ఉన్నాడు. పుష్ప 2 ప్రీమియర్ తొక్కిసలాట జరిగి మూడు నెలలు దాటినా కూడా ఇంకా అలాగే ఉన్నాడు శ్రీతేజ్.ఈ కుర్రాడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు అల్లు అర్జున్ ఆరా తీస్తున్నాడు కానీ ఏం చేస్తాం తేజ్ పరిస్థితి మాత్రం అలాగే ఉంది. ఇప్పటికీ కుర్రాడిలో ఉలుకు పలుకు లేదు. హాస్పిటల్ బెడ్డుపై అలాగే పడున్నాడు. ఆయన కోసం చేయని వైద్యం లేదు.. రాని వైద్యుడు లేడు.. అవసరం అయితే ఫారెన్ కూడా ఓకే అంటున్నారు బన్నీ టీం. కానీ లాభం లేకుండా పోతుంది. కుర్రాడు కళ్లు తెరిచి చూస్తున్నా ఎవర్నీ గుర్తు పట్టట్లేదు శ్రీతేజ్. ఆకలి లేదు.. పైకి లేచి కూర్చునే పరిస్థితి లేదు.. ఈ రోజుకు కూడా ఆహారాన్ని కేవలం పైపులతోనే అందిస్తున్నారు కానీ సొంతంగా తీసుకోలేకపోతున్నాడు ఈ అబ్బాయి. ఇప్పటికీ మూడు నెలలు అయింది.. ఇంకా ఎన్నాళ్లు పడుతుందో చెప్పలేకపోతున్నారు వైద్యులు. అసలేమైంది అని ఆరా తీస్తే చాలా సమస్యలే బయటపడుతున్నాయి. తొక్కిసలాట జరిగినప్పుడు బ్రెయిన్‌కు చాలా సేపు రక్త ప్రసరణ ఆగిపోవడంతోనే అసలు సమస్యలు వచ్చాయంటున్నారు డాక్టర్లు.ఆ షాక్‌తోనే శ్రీతేజ్ ఆరోగ్యం ఓ పట్టాన మెరుగుపడటం లేదని.. అప్పుడప్పుడూ కళ్లు తెరుస్తున్నా చలనం లేకుండానే ఉన్నాడంటున్నారు వైద్యులు. ఇది కోమా కాని కోమా అంటున్నారు వాళ్లు. ఆస్పత్రికి తరలించిన తర్వాత రక్త ప్రసరణ జరిగేలా చూసినా కూడా అప్పటికే మెదడుకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకే వెంటనే కోమాలోకి వెళ్లిపోయాడు ఆ కుర్రాడు. ఉన్నారు. ఆ తర్వాత బయటికి వచ్చినా కూడా లాభం లేదు. శ్రీతేజ్‌ను ఎలాగైనా మామూలు మనిషిని చేయాలని తపిస్తున్నారు బన్నీ టీం. అవసరమైతే విదేశీ వైద్య నిపుణుల సాయం తీసుకోవాలంటున్నారు. కావాలంటే ఫారెన్ కూడా వెళ్లండి.. మేం కూడా తోడుగా వస్తామంటున్నాడు అల్లు అర్జున్. పైగా బన్నీ వాస్ కూడా ఎప్పటికప్పుడు హాస్పిటల్‌కు వచ్చి కుర్రాడి గురించి ఆరా తీస్తున్నాడు. ప్రస్తుతానికైతే శ్రీతేజ్ ఇంకా అచేతనంగానే ఉన్నాడు.. త్వరలోనే ఆ అబ్బాయి కోలుకోవాలని మనం కూడా కోరుకుందాం..!

## చోరీ సోత్తు స్వాధీనం


**నర్సాపురం :** నర్సాపురం స్టీమర్ రోడ్డు మూడవ వార్డులో ఎర్రాప్రగడ వెంకటరత్నం తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగింది ఈ దొంగతనంలో ఐదు కేజీల వెండి దోచుకున్న దొంగలు నరసాపురం టౌన్ స్టేషన్లో కేసు పెట్టిన ఎర్రాప్రగడ వెంకటరత్నం. పోలీసులు చాకచక్యంగా సిసి కెమెరాలు తో దొంగ ను కనిపెట్టి వల ఫన్నీ పట్టుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా రాజూ ఆదాం నయీమ్ అజ్మీ ఆదేశాలతో అదనపు సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ భీమారావు ఆధ్వర్యంలో సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డాక్టర్ జి. శ్రీ వేద పర్యవేక్షణలో స్టేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి మరియు సబ్ ఇన్స్పెక్టర్ సి.హెచ్.జయలక్ష్మి ఎస్.ఐ. ముత్యాలరావు క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ కే వేణుగోపాలరావు క్రైమ్ పార్టీ పోలీస్ కానిస్టేబుల్స్ ఎస్ చక్రవర్తి. ఎం సుబ్రహ్మణ్యం.బి రాజేష్. వై మణికంఠ కలసి ముద్దాయిని దొంగలించిన సొత్తును స్వాధీన పరుచుకుని ముద్దాయిని అరెస్టు చేశారు. మిగిలిన ముద్దాయిలు త్వరలోనే పట్టుకుంటామని డిఎస్పి డాక్టర్ జి. శ్రీ వేద అన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి డాక్టర్ జి.శ్రీ వేద మాట్లాడుతూ పట్టణంలో పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు.ఎవరైనా బంధువుల ఇంటికి వెళితే ఆ విషయాన్ని పోలీస్ స్టేషన్లో చెప్తే పోలీస్ ప్రహర ఏర్పాటు చేస్తామని డిఎస్పి డాక్టర్ జి. శ్రీ వేద అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం?

**మేడ్చల్ :** మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ని అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మేడ్చల్ లో బిఆర్ఎస్ నేతలు కదం తొక్కరు. బిఆర్ఎస్ నేతలను అడ్డుకోడానికి పోలీసులు ప్రయత్నించగా తోపులాట జరిగింది.అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ గ్రంధాలయ చైర్మన్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు.

## అంతులేని ప్రచారాల్లో అల్లు అర్జున్

పుష్ప 2 ది రూల్ తర్వాత ఐకాన్ స్టార్ బన్నీ చేయబోయే కొత్త సినిమా గురించి పరిశ్రమ, మీడియా వర్గాల్లో ఎడతెగని ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. త్రివిక్రమ్ శ్రీనివాస్ తో చేయాల్సిన ఫాంటసీ మూవీ ఆలస్యమయ్యేలా ఉండటంతో అట్లీతో ఒక ప్యాన్ ఇండియా పూర్తి చేయాలనుకున్నది నిజమే. దానికి అనుగుణంగా స్క్రిప్ట్ పనులు కొలిక్కి వచ్చాయి. అయితే ఆరు వందల కోట్లకు పైగా బడ్జెట్ డిమాండ్ చేస్తున్న ఈ ప్రాజెక్టు మీద అంత పెట్టుబడి వర్కౌట్ అవుతుందానే అనుమానంతో సన్ పిక్చర్స్ వెనక్కు తగ్గినట్టు వచ్చిన పుకారు అభిమానుల్లో కొత్త కన్ఫ్యూజన్ రేపింది. దాని స్థానంలో దిల్ రాజు ప్రవేశించారనేది ఇంకో ట్విస్ట్. నిజానిజాలు కాసేపు పక్కనపెడితే అల్లు అర్జున్ మార్కెట్ మీద ఎవరికి ఎలాంటి అనుమానాలు లేవన్నది వాస్తవం. అన్నీ పుష్ప లాగా అంతే రెవిన్యూ చేస్తాయన్న గ్యారెంటీ లేకపోవచ్చు. కానీ కనీసం అయిదారు వందల కోట్లను థియేటర్, నాన్ థియేటర్ హక్కుల రూపంలో వెనక్కు తేగలిగే స్టామినా బన్నీ సంపాదించుకున్నాడనేది నిజం. కాకపోతే ఏ దర్శకుడితో చేస్తున్నాడనేది మార్కెట్ లెక్కలను నిర్ణయిస్తుంది. జవాన్ బ్లాక్ బస్టరే, అందులో అనుమానం లేదు. అయితే ఆ సినిమా దర్శకుడిగా కలిగిన ప్రయోజనం కన్నా నిర్మాతగా వ్యవహరించిన బేబీ జాన్ వల్ల జరిగిన డ్యామేజే ఇప్పుడు అట్లీ రేంజుని తగ్గించిందనేది ముంబై కథనం.




## బ్లాక్ శారీలో అందాలతో మురిపిస్తున్న నేహా మాలిక్





## ఉప్పొంగుతున్న పరువాలతో అదరహో అనిపిస్తున్న మలైకా అరోరా



## పట్టువదలనంటున్న బిచ్చగాడు హీరో

వన్ మూవీ వండర్ లాగా ఎప్పుడో దశాబ్దం క్రితం బిచ్చగాడుతో బ్లాక్ బస్టర్ సాధించిన విజయ్ ఆంటోనీ పాతిక సినిమాలు పూర్తి చేసుకోబోవడం విశేషమే. తన పాతికవ మూవీ భద్రకాళి (తమిళంలో శక్తి తిరుమగన్) త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. నిన్న టీజర్ లాంచ్ చేశారు. మైత్రి సంస్థ పంపిణి బాధ్యతలు తీసుకున్న ఈ యాక్షన్ డ్రామా కాన్సెప్ట్ కొంచెం కొత్తగా, అర్థం కానట్టుగా వెరైటీగా కట్ చేశారు. ఆరు వేల కోట్ల స్కామ్ జరిగితే ప్రభుత్వం తలకిందులయ్యే పరిస్థితి తలెత్తుంది. దానికి కిట్టు అనే యువకుడు కారణమని తెలుసుకున్న పోలీసులు అతని వెంట పడతారు. అతనెవరనేది అసలు స్టోరీ. పాయింట్ కాస్త విభిన్నంగానే అనిపిస్తోంది. విమర్శకులు మెచ్చుకున్న అరువి లాంటి సోషల్ మెసేజ్ సూపర్ హిట్ ఇచ్చిన అరుణ్ ప్రభు దీనికి దర్శకత్వం వహించాడు. విషయమున్న డైరెక్టర్ దొరికాడు కాబట్టి విజయ్ ఆంటోనీ ఈసారి సక్సెస్ సాధిస్తాడేమో చూడాలి. ఎందుకంటే తెలుగులో అతని కొత్త సినిమాలు ఎన్ని వచ్చాయో ఎన్ని పోయాయో గుర్తించే లోపే థియేటర్లలో మాయమైపోతున్నాయి. కనీసం ఓటిటిలోనూ పెద్దగా ఆదరణ దక్కడం లేదు. బిచ్చగాడు 2 ఒకటే డీసెంట్ వసూళ్లు దక్కించుకోగా మిగిలినవి చాలా మటుకు కనీసం బ్రేక్ ఈవెన్ కూడా అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో భద్రకాళి హిట్ కావడం విజయ్ ఆంటోనీకి చాలా కీలకం. ఈ టైటిల్ కోసం అతను వివాదం కొని తెచ్చుకున్న సంగతి తెలిసిందే. చివరికి సర్దుబాటు చేసి తెలుగులో ఆ పేరు విజయ్ ఆంటోనీకి ఇచ్చి తమిళంలో భద్రకాళిని శివ కార్తికేయన్ కు ఖరారు చేసారు. ఇది కొంత అయోమయానికి దారి తీసేదే అయినా ఇంతకన్నా పరిష్కారం దొరకలేదు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,